www.vishalabharati.com
epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
19.12.2023
సంపుటి:2 సంచిక:59

# విశాల భారతి


తెలుగు దిన పత్రిక



## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి..

- సీఎం హోదాలో తొలిసారి స్వాగతం పలికిన రేవంత్ రెడ్డి
- ఈ నెల 23 వరకు రాష్ట్రంలో శీతాకాల విడిది
- వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న ద్రౌపది ముర్ము

..మిగతా 2 లో



## కరోనా కొత్త వేరియంట్‌పై
# కేంద్రం అలర్ట్..

- రాష్ట్రాలకు కీలక ఆదేశాలు
- ఆర్టీపీసీఆర్ టెస్టులకు రెడీగా ఉండాలని ఆదేశం
- కొత్త వేరియంట్ జేఎన్-1 ను కేరళలో గుర్తింపు
- ఐదుగురు మృతి చెందినట్టు నిర్ధరణ

**విశాల భారతి, న్యూఢిల్లీ:**

దేశంలో మరోసారి కరోనా కేసులు పెరుగుతున్నాయి. కొత్త వేరియంట్ వైరస్ జేఎన్.1 తొలి కేసు నిర్ధారణ కావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జిల్లాల వారీగా ఇన్‌ఫ్లుఎంజా వంటి అనారోగ్యాలు, శ్వాసకోస సంబంధ వ్యాధుల నమోదును పర్యవేక్షించడంతోపాటు వాటి గురించి రిపోర్ట్ ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. కరోనా పరిస్థితిపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఆర్టీపీసీఆర్ పరీక్షలను పెంచాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది. కరోనా పాజిటివ్ కేసుల నమూనాలను జీనోమ్ సీక్వెన్స్ కోసం జాతీయ ల్యాబ్‌లకు పంపాలని తెలిపింది. తద్వారా కొత్త వేరియంట్‌లను సకాలంలో గుర్తించడం సాధ్యమవుతుందని కేంద్రం పేర్కొంది. మరోవైపు రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. పరిశుభ్రత విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యాధుల వ్యాప్తి పెరిగే ప్రమాదాన్ని నివారించేందుకు అవసరమైన ప్రజారోగ్య చర్యలు, అవగాహన కార్యక్రమాలు వంటివి చేపట్టాలని రాష్ట్రాలకు సూచించింది.

అప్రమత్తంగా ఉండాలన్న డబ్ల్యూహెచ్‌వో

భారత్‌లో మళ్లీ కరోనా ప్రకంపనలు రేపుతోంది. ఆదివారం దేశవ్యాప్తంగా 335 కొత్త కరోనా కేసులు వెలుగులోకి రావడంతో.. ప్రజల్లో గుబులు మొదలైంది. ఇదిలా ఉండగా ఈ కరోనాతో కొత్తగా ఐదుగురు చనిపోవడంతో.. తీవ్ర కలకలం రేపుతోంది. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 1,701గా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మృతుల్లో నలుగురు కేరళ వాసులు ఉండగా.. యూపీలో ఓ వ్యక్తి కరోనాతో చనిపోయారు. ఇదే సమయంలో.. ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతుండడంతో డబ్ల్యూహెచ్వో కీలక సూచనలు చేసింది. వ్యాధి వ్యాప్తి తీరును జాగ్రత్తగా పరిశీలించాలని, వైరస్ జీనోమ్ సీక్వెన్సింగ్ సమాచారం ఎప్పటికప్పుడు పంచుకోవాలని పేర్కొంది. ఈ మేరకు డబ్ల్యూహెచ్ వో సాంకేతిక విభాగం చీఫ్ డాక్టర్ మరియా వాన్ ఖర్కోవ్ కీలక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ల కేసులకు గల కారణాలను ఆమె వివరించారు.

## కరోనాపై తెలంగాణ గవర్నమెంట్
# అలర్ట్

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ మినిస్టర్‌పిలుపు
- వైద్యారోగ్య శాఖ ముందుజాగ్రత్తలు పాటించాలని ఆదేశం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

పొరుగు రాష్ట్రాల్లో కొవిడ్-19 కేసులు పెరుగుతున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సూచన మేరకు వైద్యశాఖ కూడా అలర్ట్‌గా ఉండాలని ఆయన సోమవారం ఓ ప్రకటన రిలీజ్ చేశారు. కేరళ రాష్ట్రంలో ఈ నెల 8న కొవిడ్ కొత్త వేరియంట్ జేఎన్–1 వెలుగులోకి వచ్చిన

..మిగతా 2 లో



## నూతన పారిశ్రామిక వాడలకు..
# భూములు కావాలి

- ఔటర్, రీజనల్ మధ్య వెయ్యి ఎకరాలు గుర్తించండి
- ఎయిర్‌పోర్ట్, హైవేలకు 100 కి.మీ లోపే ఉండాలి
- పారిశ్రామికాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- గత ప్రభుత్వం కేటాయించిన భూములపై ఆరా
- పరిశ్రమలకు సోలార్‌పవర్ వాడేలా చూడాలని ఆదేశం

"నూతన పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసేందుకు ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజినల్ రింగ్ రోడ్డుకు లోపల 500 నుంచి 1,000 ఎకరాల వరకు భూములను గుర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇవి కూడా విమానాశ్రయాలకు, జాతీయ, రాష్ట్రీయ రహదారులకు 50 నుంచి 100 కిలోమీటర్ల దూరంలోపే ఉండాలని అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పై సోమవారం సెక్రటేరియట్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలసి సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల కోసం సేకరించే భూములు, బంజరు భూములై ఉండడంతోపాటు సాగుకు యోగ్యంకానివిగా ఉండాలని స్పష్టం చేశారు. దీనివల్ల, రైతులకు నష్టం కలుగకుండా ఉండడంతోపాటు కాలుష్యం తక్కువగా ఉండి, అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేవిధంగా ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు రాష్ట్రంలో పరిశ్రమలకు కేటాయించిన భూములు, ఆ భూములను పారిశ్రామిక అవసరాలకు కాకుండా ఉపయోగించకుండా ఉన్న భూములపై పూర్తి వివరాలు అందజేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

**కేటాయించిన భూముల వివరాలు ఇవ్వండి**

పారిశ్రామిక వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తున్నట్లు సీఎం తెలిపారు. 'రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు అనేక కంపెనీలకు పెద్ద ఎత్తున భూములను కేటాయించారు. ఆ భూముల్లో ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేశారు? వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటి?' అనే అంశాలపై పూర్తి నివేదిక సమర్పించాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రాధాన్యత నివ్వాలని, హైదరాబాద్ లోని నాచారం, జీడిమెట్ల, కాటేదాన్ తదితర పారిశ్రామిక వాడల విషయంలో ప్రత్యామ్నాయాలను సూచించాలని పేర్కొన్నారు. బల్క్ డ్రగ్ ఉత్పత్తుల కంపెనీల ఏర్పాటుకు చేపట్టాల్సిన చర్యలపై మధ్య ప్రాచ్య, యూరోపియన్ దేశాలలో అమలులో ఉన్న విధానాలపై అధ్యయనం చేయాలని కోరారు.

**ఐడీపీఎల్‌భూములపై సీఎం ఆరా**

రాష్ట్రంలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో ప్రభుత్వ, నిరుపయోగ, బంజరు భూములను గుర్తించి పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఇవి నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాలన్నారు. దీనివల్ల, ఆయా భూములకు ధరలు కూడా తక్కువగా ఉండడంతోపాటు భూసేకరణకు రైతులు కూడా సహకరిస్తారని తెలియజేశారు. పరిశ్రమలకు థర్మల్ విధ్యుత్ వినియోగం కాకుండా సోలార్ పవర్ ను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని గ్రామాలను మోడల్ గ్రామాలుగా అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యమిస్తూ తగు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలానగర్ లోని ఐడీపీఎల్ భూముల పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ కృష్ణ భాస్కర్, సీఎంవో అధికారులు శేషాద్రి, శివధర్ రెడ్డి, షానవాజ్ కాసీం తదితరులు హాజరయ్యారు.



## రేవంత్.. శభాష్

- మిడ్ మానేరు బాధితుల సమస్యను ప్రస్తావించడం అభినందనీయం
- `సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లే



..మిగతా 2 లో



## ఒకేరోజు 70 మందిపై
# సస్పెన్షన్ వేటు

- ఆందోళనలో నేపథ్యంలో నిర్ణయం
- కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి సహా 70 మంది ఔట్
- ఉభయసభలు రేపటికి వాయిదా

..మిగతా 2 లో



..మిగతా 2 లో

# పల్లవి ప్రశాంత్ పై కేసు

- అన్నపూర్ణ స్టూడియోస్ లో ఫ్యాన్స్ బీభత్సం
- సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు
- బిగ్ బాస్ రన్నరప్ అమర్ దీప్ పై దాడి



# ఎవరినీ వదిలిపెట్టం

- ఏదో ఒక లెటర్ ఇచ్చి తప్పించుకోవాలని చూస్తే ఊరుకోం
- 'మేడిగడ్డ' నాసిరకం పనులపై మంత్రి ఉత్తమ్ వార్నింగ్
- రివ్యూ మీటింగ్‌లో 'ఎల్అండ్ టీ' ప్రతినిధులపై సీరియస్
- ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టినప్పటి నుంచి పాలనలో వేగం పెంచింది. తనదైన దూకుడు ప్రదర్శిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్‌వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. మొన్నటి వరకూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించిన రేవంత్, ఉత్తమ్‌నీటి ప్రాజెక్టులపై సమగ్ర వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. మంత్రులందరూ ఇదే జోష్‌లో తమ పరిపాలనా దక్షతకు పదును పెడుతున్నారు. మొన్నటి వరకు పౌర సరఫరాశాఖ అధికారులతో సమీక్షలు జరిపిన తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం నీటి ప్రాజెక్టులు నిర్మించిన ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మేడిగడ్డ బ్యారేజ్ పనులు చేపట్టిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ బృందంతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ మీటింగ్‌లో ఎల్ అండ్ టీ గ్రూప్ డైరెక్టర్ ఎస్.వి దేశాయ్‌తోపాటు పలువురు సంస్థకు చెందిన ప్రతినిధులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎల్ అండ్ టీ ప్రతినిధులపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం

..మిగతా 4 లో

# 20 ఏండ్లు ఒక లెక్కా.. ఇప్పుడు ఒక లెక్కా..

## అసలు అభివృద్ధి ఎట్లుంటదో చూపిస్తా..

- 24/7 నల్గొండ ప్రజలకు అందుబాటులో ఉంటా
- రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మంత్రిగా జిల్లాకు తొలిసారి రావడంతో అపూర్వ స్వాగతం
- హెలికాప్టర్‌తో వెంకన్నపై పూల వర్షం కురిపించిన అభిమానులు
- నల్గొండ ప్రజల ఆకాంక్షలను అందరం కలిసి నెరవేర్చుకుందాం
- కలెక్టరేట్‌లో పలు శాఖల పై సమీక్షించిన మంత్రి కోమటిరెడ్డి

..మిగతా 2 లో



# కరోనాపై తెలంగాణ గవర్నమెంట్ అలర్ట్

మొదటిపేజీ తరువాయి

నేపథ్యంలో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే పండుగల సీజన్ నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన మేరకు మాస్కులను ధరించాలని సూచించారు.ముందస్తు జాగ్రత్తగా ప్రజారోగ్య శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇతర ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కొవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉన్నదని, తగినన్ని వ్యాధినిర్ధారణ పరీక్షలకు కావాల్సిన కిట్స్, చికిత్సకు అవసరమైన మందులు ఆక్సిజన్ అందుబాటులో ఉన్నాయని అధికారులకు మంత్రి వివరించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, వాతావరణ పరిస్థితులతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నదని, డాక్టర్ల సలహాతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



# హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి..

- సీఎం హోదాలో తొలిసారి స్వాగతం పలికిన రేవంత్ రెడ్డి
- – ఈ నెల 23 వరకు రాష్ట్రంలో శీతాకాల విడిది
- వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న ద్రౌపది ముర్ము

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఆమెకు స్వాగతం పలికేందుకు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తో పాటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరితో పాటూ మరి కొందరు కేబినెట్ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు.ఏటా శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి హైదరాబాద్ చేరుకోవడం ఆనవాయితీ. ఎన్నో ఏండ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. అందులో భాగంగానే ద్రౌపది ముర్ము హైదరాబాద్ కి విచ్చేశారు. రాష్ట్రపతి రాకతో పోలీసు ఉన్నతాధికారులు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ చేరుకున్న ముర్ము బొల్లారంలోని రాష్ట్రపతి నివాసంలో బస చేయనున్నారు. ఈ నెల 23 వరకూ రాష్ట్రంలో ఆమె పర్యటన కొనసాగనుంది. డిసెంబర్20న రాష్ట్రపతి భూదాన్ పోచంపల్లిలో పర్యటించనున్నారు. పోచంపల్లిలో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శనలో పాల్గొంటారు. చేనేత కార్మికులతో ముచ్చటించనున్నారు. ఈ విడిది కాలంలో పలువురు ముఖ్యనేతలతో పాటూ పలు రంగాల ప్రముఖులను కలువనున్నట్లు తెలుస్తోంది. ఐదు రోజుల పర్యటన పూర్తి చేసుకుని 23న తిరిగి ఢిల్లీ వెళ్లనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించారు. రాష్ట్రపతి హోదాలో ఇలా విడిదికి రావడం ఇది రెండో సారి. గత ఏడాది డిసెంబర్26న హైదరాబాద్‌కు వచ్చి ఐదు రోజులు పర్యటించి డిసెంబర్30న ఢిల్లీకి తిరిగి వెళ్లారు.

# పల్లవి ప్రశాంత్ పై కేసు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

'బిగ్ బాస్' తెలుగు సీజన్ 7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌పై కేసు నమోదైంది. ఆదివారం జరిగిన బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 ఫైనల్ ఎపిసోడ్ అనంతరం పల్లవి ప్రశాంత్ అభిమానులు అన్నపూర్ణ స్టూడియోస్ దగ్గర బీభత్సం సృష్టించారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీన్ని సుమోటోగా తీసుకుని జూబ్లీహిల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అంతే కాకుండా పోలీసులు ఎంత చెప్తున్నా వినకుండా పల్లవి ప్రశాంత్ బయట ర్యాలీ చేశాడు. దీంతో ఐపీసీ సెక్షన్ 147, 148, 290, 353, 427, 149 సెక్షన్ల కింద పల్లవి ప్రశాంత్‌పై కేసులు నమోదయ్యాయి.ఫైనల్ ముగిసిన తర్వాత అన్నపూర్ణ స్టూడియో నుంచి బయటకు వస్తున్న అమర్ దీప్, అశ్విని, గీతూ రాయల్ కార్లపై పల్లవి ప్రశాంత్ ఫ్యాన్స్ అని చెప్పుకుంటూ కొందరు దాడికి దిగారు. కేవలం కార్లపై మాత్రమే కాకుండా అటు వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై కూడా దాడి చేశారు. వారిని కంట్రోల్ చేయడం కోసం పోలీసులు ఎంతో కష్టపడ్డారు. అదే సమయంలో పల్లవి ప్రశాంత్ కారును కూడా అక్కడ ఆపకుండా పంపించేశారు. అయితే బయట ఏం జరుగుతుందో తెలియని రైతు బిడ్డ పల్లవి ప్రశాంత్ పోలీసులపై సీరియస్ అయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'శాంతిభద్రతలకు భంగం కలుగుతోంది. నడవండి. బండి కదులుతూనే ఉండాలి. ఆగొద్దు' అని పోలీసులు చెప్తూ ఉండటం ఈ వీడియోలో చూడవచ్చు.

'ఏంటన్నా ఇది. ఒక రైతుబిడ్డకు కొంచెం కూడా విలువ ఇవ్వట్లేదు' అని పల్లవి ప్రశాంత్ ప్రశ్నించాడు. తనను కలవడానికి వచ్చిన ఒక అభిమాని కారు వెంట పరిగెత్తుకుంటూ వస్తూ ఏడుస్తుందని కారులో ఉన్న ఒక వ్యక్తి పల్లవి ప్రశాంత్‌తో చెప్పాడు. 'ఏం చేయాలిరా. పోలీసులే వద్దంటున్నారు' అని ఆ వ్యక్తిపై కూడా పల్లవి ప్రశాంత్ సీరియస్ అయ్యాడు. 'ప్రశాంత్ నీకోసం ఇంతమంది వస్తుంటే నువ్వు ఎందుకు ఆగట్లేదు. ఒక కామన్ మ్యాన్‌గా నిన్ను సపోర్ట్ చేయట్లేదా' అని ఒక అమ్మాయి రైతు బిడ్డను ప్రశ్నించింది. కానీ దాన్ని కూడా పల్లవి ప్రశాంత్ పట్టించుకోలేదు. జనాలను, పోలీసులను మొత్తం వీడియోలు తీయమని కారులో ఉన్న తన ఫ్రెండ్స్‌కు ప్రశాంత్ చెప్పడం ఈ వీడియోలో చూడవచ్చు.

కొందరు పోలీసులు ప్రశాంత్‌ను వెళ్లిపోమని చెప్తుంటే ఒక పోలీస్ మాత్రం కారు పక్కన పరిగెడుతూ వచ్చి రైతు బిడ్డను పలకరించాడు. 'ఎలా ఉన్నావు, ఇంటికి వచ్చి కలుస్తా' అని ప్రశాంత్‌కు చెప్పాడు. అది చూసిన ప్రశాంత్ ఆయనకు షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. 'పోలీసులే ఇలా చేస్తున్నారు ఏంటన్నా? ఒక రైతుబిడ్డ అన్నా.' అని పోలీసుకు చెప్తూ బాధపడ్డాడు. కానీ ఆ పోలీస్ మాత్రం పల్లవి ప్రశాంత్ చెప్పేది పట్టించుకోకుండా వెళ్లిపోమన్నాడు. దీంతో ఏం చేయలేని పరిస్థితిలో ప్రశాంత్ తనకోసం వచ్చిన అభిమానులకు సారీ చెప్పాడు. నిజానికి పోలీసులు జోక్యం చేసుకొని పంపించడం వల్లనే పల్లవి ప్రశాంత్ సేఫ్‌గా వెళ్లగలిగాడు. కానీ రన్నరప్ అమర్‌దీప్‌పై దాడిని వారు కంట్రోల్ చేయలేకపోయారు. అమర్ కారు అద్దాలు కూడా పగిలిపోయాయి. కారులో ఉన్న అమర్ కుటుంబం అయితే భయపడ్డారు.

# రేవంత్.. శభాష్

- మిడ్ మానేరు బాధితుల సమస్యను ప్రస్తావించడం అభినందనీయం
- సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

విశాలభారతి,స్టేట్ బ్యూరో:



త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణలో ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి కి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ లేఖ రాశారు. మిడ్ మానేరు ముంపు బాధితుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడం అభినందనీయమని చెప్పారు. ఈ మేరకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మిడ్ మానేరు బాధితుల సమస్యలను లేఖలో సంజయ్ ప్రస్తావించారు. ఒక్కో బాధిత కుటుంబానికి ఇళ్ల నిర్మాణానికి రూ.5.04 లక్షల చెల్లించాలని విన్నవించారు. నీలోజిపల్లి నుంచి నందిగామ అగ్రహారం వరకు ఇండస్ట్రీయల్ కారిడార్‌తో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు. అర్హత లేకున్నా మిడ్ మానేరు ముంపు ప్యాకేజీ పరిహారం తీసుకున్న రాజ్యసభ సభ్యుడు సంతోశ్ సహా మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం తక్షణమే సంబంధిత శాఖ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌ను సంజయ్ కోరారు.

# 20 ఏండ్లు ఒక లెక్కా..

# ఇప్పుడు ఒక లెక్కా..

## అసలు అభివృద్ధి ఎట్లుంటదో చూపిస్తా..



- 24/7 నల్గొండ ప్రజలకు అందుబాటులో ఉంటా
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మంత్రిగా జిల్లాకు తొలిసారి రావడంతో అపూర్వ స్వాగతం
- హెలికాప్టర్‌తో వెంకన్నపై పూల వర్షం కురిపించిన అభిమానులు
- నల్గొండ ప్రజల ఆకాంక్షలను అందరం కలిసి నెరవేర్చుకుందాం
- కలెక్టరేట్‌లో పలు శాఖల పై సమీక్షించిన మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ , విశాల భారతి:



తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఇప్పుడిప్పుడే తమ సొంత జిల్లాలకు వెళుతున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి సొంత జిల్లాలకు వెళుతున్న మంత్రులకు, అక్కడి ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభిస్తోంది. సోమవారం ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి నల్గొండకు వెళ్లగా.. ఉమ్మడి జిల్లా ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. నల్గొండ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ప్రతి పేదవాడి కన్నీరు తుడిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. 'గత 20 ఏండ్లు ఒక లెక్కా.. ఇప్పుడు ఒక లెక్కా.. అసలు అభివృద్ధి ఎట్లుంటదో చూపిస్తా' అని వెంకట్‌రెడ్డి జిల్లా ప్రజలకు భరోసా నిచ్చారు. 'మాట తప్పం.. మడమ తిప్పం' అన్న ఆయన నల్గొండలో గుండాయిజం, రౌడీయిజం లేకుండా చేస్తానన్నారు. 24 గంటలు నల్గొండ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. నల్గొండలో అద్భుతంగా తీర్చిదిద్దుతామని, జిల్లాలో ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గత పదేండ్లలో గజ్వేల్, సిద్దిపేట్, సిరిసిల్ల తప్ప.. ఎక్కడ అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. బెల్ట్ షాపులను ముయిస్తామని, గంజాయి గ్యాంగుల ఆట కట్టిస్తామని పేర్కొన్నారు. 6 గ్యారంటీలను 100 రోజుల్లో ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే 2 గ్యారంటీలను అమలు చేశాం, ఈ నెల చివర్లో మరో రెండు గ్యారెంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల వరకుఉచితంగా ట్రీట్మెంట్ తీసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆడబిడ్డలంతా ఎంతో సంతోషంగా ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ, బడుగు బలహీన వర్గాల పార్టీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకి న్యాయం జరుగుతుందన్నారు. 10 యేండ్ల నియంత పాలన పోయి.. నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. నల్గొండ జిల్లాను సుభిక్షంగా మారుస్తామన్నారు.

చిట్యాల మున్సిపాలిటీకి అధిక నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తాననని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండకు వస్తుండగా.. చిట్యాల వద్ద ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిట్యాల సెంటర్ లో మహనీయుల విగ్రహాలకు మంత్రి వెంకట్ రెడ్డి పూలమాల వేసిన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో నకిరేకల్ లో గెలిపించి వీరేశంను ఎమ్మెల్యే గా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. 'చిట్యాలలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణానికి జనవరి 2న టెండర్ స్టార్ట్ చేసి సంక్రాంతికి శంకుస్థాపన చేస్తాం. చిట్యాల– భువనగిరి రోడ్డు నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభించి ప్రమాదాలు జరగకుండా చూస్తాం' అని హామీ ఇచ్చారు. అంతకుముందు యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపూర్ ఆందోల్ మైసమ్మ దేవాలయంలో అమ్మావారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేదవారి కన్నీరు తుడిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

### అధికారులు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

అధికారులు ప్రజా ప్రతినిధులకు సహకరించి జిల్లా అభివృద్ధి కి కృషి చేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన నివాసం వద్ద పోలీసులు మంత్రికి గౌరవ వందనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంకు చేరుకున్న మంత్రికి కలెక్టర్ అర్.వి.కర్ణన్, అడిషనల్ కలెక్టర్ లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్ లు మొక్కని అందజేసి స్వాగతం పలికారు. కలెక్టరేట్ లో మిషన్ భగీరథ, విద్యుత్, రహదారులు, పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చట్ట సభల ద్వారా శాసనాలు చేస్తుందని, ప్రభుత్వ పాలసీ లు అమలు చేయడం ఉద్యోగులు బాధ్యత అని అన్నారు. జిల్లా లోని వివిధ శాఖలు అధికారులు ప్రజా ప్రతినిధులకు సహకారం అందిస్తూ జిల్లా ను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు నిస్పక్షపాతంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద పేదలకు చాలా నమ్మకం, ఆశలు ఉన్నాయి.. వారి ఆశల్ని మనమందరం కలిసి నిలబెట్టాలని మంత్రి అధికారులతో అన్నారు. తమ ప్రభుత్వం అధికారులు,ఉద్యోగులను గౌరవిస్తుందని, నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. మిషన్ భగీరథ పై సమీక్ష లో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీళ్లు ఇవ్వకపోవడం అత్యంత శోచనీయమని అన్నారు. ఏ గ్రామానికి పోయినా ప్రజలు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే లు వేముల వీరేశం,బత్తుల లక్ష్మా రెడ్డి, ఎం.శామ్యూల్, బాలూ నాయక్ లు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని మిషన్ భగీరథ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు పనులు లోపాలు ఉన్న చోట పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే సదరు కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టి రెవెన్యూ రికవరీ చట్టం ద్వారా రికవరీ చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో విద్యుత్ సమస్యలు ఉండకూడదని, సబ్ స్టేషన్ల ఏర్పాటు, విస్తరణ కోసం టెండర్లు పిలిచి పనులు చేయకపోవడం పై అధికారులని మంత్రి వివరణ కోరారు. కరెంట్ షాక్ తో మరణించిన 32 మందికి కంపెన్సేషన్ ఇప్పటికి ఇవ్వకపోవడం బాధాకరమని, వెంటనే చర్యలు చేపట్టి వారికి కంపెన్సేషన్ ఇవ్వాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.









# ఒకేరోజు 70 మందిపై సస్పెన్షన్ వేటు

- ఆందోళనలో నేపథ్యంలో నిర్ణయం
- కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి సహా 70 మంది ఔట్
- ఉభయసభలు రేపటికి వాయిదా

విశాల భారతి,నేషనల్ బ్యూరో:

పార్లమెంట్‌లో గతవారం చోటుచేసుకున్న భద్రతా వైఫల్యం ఘటనపై ఉభయ సభల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. విపక్షాల నిరసనలతో సోమవారం కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో కార్యకలాపాలు స్తంభించాయి. మరోవైపు, సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నందుకు గానూ సోమవారం ఒక్క రోజే 70 మందికి పైగా విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడటం గమనార్హం. లోక్‌సభలో 33 మంది, రాజ్యసభ లో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు.కాంగ్రెస్ సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌధరి సహా 33 మందిని సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ నేడు ప్రకటించారు. వీరిలో 30 మందిని ఈ శీతాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయగా.. మరో ముగ్గురిని ప్రివిలేజెస్ కమిటీ నివేదిక వచ్చే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ఎంపీలు కె. జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖలీఖ్ స్పీకర్ పోడియం వద్ద నినాదాలు చేశారు. వీరి ప్రవర్తనపై ప్రివిలేజెస్ కమిటీ నివేదిక ఇవ్వనుంది.మరోవైపు శీతాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్‌కు గురైన వారిలో కాంగ్రెస్ సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌధరీ, ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగొాయ్, డీఎంకే ఎంపీలు ఎ.రాజా, టీఆర్ బాలు, దయానిధి మారన్, టీఎంసీ ఎంపీలు సౌగతా రాయ్, కల్యాణ్ బెనర్జీ, కకోలి ఘోష్, శతాబ్ది రాయ్ తదితరులు ఉన్నారు. సభాపతి ఆదేశాలు ధిక్కరించిన సభ్యుల సస్పెన్షన్‌కు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మూజువాణీ ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. కాగా.. లోక్‌సభలో ఇప్పటికే 13 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. గత గురువారం వారిపై వేటు వేశారు. దీంతో ఈ సమావేశాల్లో ఇప్పటివరకు మొత్తం 46 మందిని లోక్‌సభ నుంచి సస్పెండ్ చేసినట్లయింది.

### రాజ్యసభలో 45 మందిపై వేటు

అటు రాజ్యసభలో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం ప్రకటించారు. కాంగ్రెస్ ఎంపీలు జైరాం రమేశ్, రణ్‌దీప్ సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్ సహా పలు పార్టీల విపక్ష నేతలపై ఈ వేటు పడింది. వీరిలో 34 మందిని ఈ శీతాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయగా.. మరో 11 మందిని ప్రివిలేజెస్ కమిటీ నివేదిక అందే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ వెల్లడించారు. కాగా.. ఇప్పటికే రాజ్యసభలో టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియెన్‌పై ఈ శీతాకాల సమావేశాలు ముగిసేవరకు సస్పెన్షన్ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. దీంతో నేటి సస్పెన్షన్‌తో కలిపి ఈ శీతాకాల సమావేశాల్లో ఇప్పటివరకు మొత్తంగా 90 మందికి పైగా విపక్ష ఎంపీలు సస్పెండ్ అయ్యారు.

### ఉభయ సభలు రేపటికి వాయిదా..

'భద్రతా వైఫల్యం'పై ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై కేంద్రం సభలో ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడ్డాయి. విపక్షాలు ఎంతకీ వెనక్కి తగ్గకపోవడంతో ఉభయ సభలను సభాపతులు రేపటికి వాయిదా వేశారు.





# జాతీయ పార్టీల బస్తీమే సవాల్!

- తెలంగాణ నుంచే మోడీ, సోనియా..
- పోటీకి నిలిపేలా రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ నేతల ప్రయత్నాలు
- మెదక్, మల్కాజ్‌గిరి, కరీంనగర్‌నుంచి పోటీకి ప్లాన్?

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో పొలిటికల్ సీన్ మారిపోయిందా? బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను కాదని.. కాంగ్రెస్, బీజేపీలు నువ్వా? నేనా? అంటూ తలపడబోతున్నాయా? కొత్త స్కెచ్చులతో ఈ రెండు జాతీయ పార్టీలు దూసుకొస్తుండడం చూస్తే.. అది నిజమే అనిపిస్తోంది. గత పదేండ్లుగా తెలంగాణలో గులాబీ పార్టీ గుబాళిస్తే.. ఇప్పుడు ఒక్కసారిగా సీన్ రివర్స్ అయ్యింది. నేషనల్‌పార్టీస్‌అయిన కాంగ్రెస్, బీజేపీలు.. బీఆర్ఎస్‌ను సైడ్ చేసి.. బస్తీమే సవాల్ అనుకుంటున్నాయి. దేనికదే ఖతర్నాక్ ప్లాన్‌తో ముందుకొస్తున్నాయి. ఎంపీ ఎలక్షన్స్‌లో ఇద్దరు అగ్రనేతల్ని ఈసారి రాష్ట్రంనుంచి బరిలో నిలిపేలా వ్యూహరచన చేస్తున్నాయి. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే జోష్‌ను కంటిన్యూ చేయాలనుకుంటోంది. అందుకే, సోనియాను.. తెలంగాణలోని ఏదో ఒక ఎంపీ స్థానం నుంచి బరిలో నిలిపేలా ఒప్పించాలని నిర్ణయించింది టీపీసీసీ. దీనిపై ఇవాళ జరిగిన పీఏసీ మీటింగ్‌లో తీర్మానం కూడా చేసేసింది. మెదక్, మల్కాజ్‌గిరి, కరీంనగర్.. ఈ మూడింట్లో ఏదో ఒక స్థానం నుంచి ఆమెను బరిలో నిలపేలా ప్లాన్ చేస్తోంది. బీజేపీ కూడా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఇదేటైపు అస్త్రాన్ని ప్రయోగించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ప్రధాని నరేంద్రమోదీని.. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి బరిలో దిగేలా ఒప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు తెలంగాణ బీజేపీ నేతలు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్ స్థానాల పేర్లు.. ఈ లిస్టులో వినిపిస్తున్నాయి. అయితే, ఈ విషయంలో పార్టమెంట్‌బోర్డు పార్టీ నిర్ణయమే ఫైనల్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారు. అటు కాంగ్రెస్ నుంచి సోనియా.. ఇటు బీజేపీ నుంచి మోదీ ఒకవేళ నిజంగానే ఈ ఇద్దరు అగ్రనేతలు ఈసారి తెలంగాణ నుంచి బరిలో ఉంటే మాత్రం.. జనరల్ ఎలక్షన్స్‌లో ఈసారి రచ్చ రచ్చే. చూడాలి ఏం జరుగుతుందో మరి..





# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అంగీకరించబోం

**టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్**

**విశాలభారతి,ఆంధ్ర ప్రదేశ్:** ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అంగీకరించబోమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు. సోమవారం నారా లోకేష్‌ను విశాఖ ఉక్కు నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ భారతదేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం విశాఖ ఉక్కు. విశాఖ ఉక్కు ఇప్పటి వరకు రూ.40 వేల కోట్లను వివిధ పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్రాలకు చెల్లించిందని నారా లోకేష్ తెలిపారు. ఆంధ్రుల ఆత్మ గౌరవంతో ముడివడి ఉన్న ఇలాంటి ప్రతిష్టాత్మకమైన సంస్థను ప్రైవేటీకరణ చేస్తుంటే కేసులకు భయపడి జగన్మోహన్‌రెడ్డి నోరు మెదపడం లేదు. కొందరు బడా పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కయితే ఖాళీగా ఉన్న సుమారు 8వేల ఎకరాల భూములను అడ్డగోలుగా దోచుకునేందుకు జగన్ వ్యూహరచన చేశాడు. 5కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి జగన్‌రెడ్డి కమీషన్ల కోసం, ప్లాంట్‌లో వాటాల కోసం ఆరాటపడడం అత్యంత దుర్మార్గం. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై పార్లమెంటులో మా గళాన్ని వినిపిస్తాం. నిర్వాసితులకు అన్యాయం జరగకుండా అవసరమైన చర్యలు చేపడతాం.విశాఖ ఉక్కు మనుగడకు అవసరమైన క్యాప్టివ్ మైన్స్, కాస్ట్ కటింగ్ వంటి అంశాలపై దృష్టిసారించి, రాష్ట్రప్రభుత్వం తరపున అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తామని నారా లోకేష్ తెలిపారు. జగన్ పాలనలో నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతింది : జగన్మోహన్‌రెడ్డి విధ్వంసక పాలనలో నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతిందని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం నాడు నారా లోకేష్‌ను కళాసీ సంఘ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ "కరోనా సమయంలో పనుల్లేక వందలాది మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు చెందిన 3వేల కోట్ల రూపాయల నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారిమళ్లించింది. టీడీపీ పాలనలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక పథకాలు అందించాం. జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ పథకాలన్నీ రద్దు చేశాడు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు, బీమా పథకాల అమలుకు చర్యలు చేపడతామని నారా లోకేష్ తెలిపారు.లోకేష్‌ను కలిసిన జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు : కాగా నారా లోకేష్‌ను జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిశారు. గాజువాకలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో లోకేష్‌కి విద్యార్థులు స్వాగతం పలికారు.

# లోక్ సభ ఎన్నికలే టార్గెట్..

- హవా కొనసాగించేందుకు హస్తం పార్టీ అడుగులు..
- సోనియా తెలంగాణ నుంచి పోటీ చేయాలని తీర్మానం
- అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా మంత్రులు
- గెలుపు బాధ్యతలు ఇన్‌చార్జిలదేనన్న హైకమాండ్
- డిసెంబర్28న మరో 4 గ్యారంటీలు అమలు ప్రకటన?



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారి పార్టీ రాజకీయ సమావేశాన్ని సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేశారు. ఏఐసీసీ ఇన్‌చార్జి థాక్రె అధ్యక్షతన జరిగిన సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు, సీనియర్ నేతలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్స్, పీఏసీ సభ్యులు హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికలే ఎజెండాగా జరిగిన సమావేశంలో తెలంగాణ నుంచి సోనియా గాంధీ లోక్ సభకి పోటీ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీంతో పాటు లోక్ సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలే లక్ష్యంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మంత్రిని నియమిస్తూ పీఏసీ నిర్ణయం తీసుకుంది.

**లోక్ సభ ఇన్‌చార్జ్‌లు వీళ్లే..**

పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న రేవంత్ రెడ్డికి చేవెళ్ల నియోజకవర్గం అప్పగించగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కి ఇంచార్జ్‌గా భట్టి విక్రమార్కను నియమించారు. అలాగే ఆదిలాబాద్, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. నల్గొండ ఉత్తమ్ కుమార్ రెడ్డికి అప్పగించగా.. భువనగిరిలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు. కరీంనగర్‌లో పొన్నం ప్రభాకర్, మహబూబాబాద్‌లో సీతక్క, వరంగల్ నుంచి కొండా సురేఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్‌లుగా ఖరారు చేశారు. జహీరాబాద్ దామోదర రాజనర్సింహను ఇంచార్జ్‌లుగా నియమించారు. సంక్రాతి పండుగ తరువాత పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటిస్తామని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తెలిపారు. 6 గ్యారంటీ స్కీమ్స్ అమలు కోసం జిల్లాకు ఒక మంత్రిని ఇంచార్జ్‌గా వేయనున్నారు. నామినేటెడ్ పోస్టులను నెలలోపు భర్తీ చేస్తామని నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ పదవులపై అధిష్టానం చూసుకుంటుందని ప్రతి కార్యకర్తకు సంక్షేమ పథకాలు లబ్ది జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

**4 గ్యారంటీల అమలు అప్పడే..**

ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తుండడంతో పాటు ఆరోగ్య శ్రీ కింద పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచుతూ చికిత్స అందిస్తున్నారు. అయితే మిగిలిన అన్ని పథకాలు ఎప్పటి నుంచి అమలు చేయాలన్న దానిపై తేదీలను అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించనున్నారని షబ్బీర్ అలీ తెలిపారు. వీటితో పాటు రాష్ట్రం ఆర్థిక పరిస్థితి, సాగు నీటి ప్రాజెక్టులు, విద్యుత్‌పై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయడంతో పాటు ఆరు గ్యారంటీ స్కీమ్స్ అప్లికేషన్లు ప్రారంభించనున్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సభ ఏర్పాట్లకు మహేశ్‌కుమార్ గౌడ్‌ని ఇన్‌చార్జిగా నియమించారు. రాష్ట్రం నుంచి 50 వేల మంది సభలో పాల్గొననున్నారు.



# ఆత్మకూరు మండలానికి అండగా ఉంటా

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** ఆత్మకూర్‌మండలానికి అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. అయిలయ్య ప్రభుత్వ విప్‌గా పదవి పొందిన సందర్భంగా సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో విజయోత్సవ ర్యాలీ, సమావేశం నిర్వహించారు. హాజరైన అయిలయ్య ముందుగా మండల కేంద్రంలో పలు కుల సంఘ భవనాలకు , ఆరోగ్య ఉప కేంద్రానికి, పలు సీసీ రోడ్లలకు శంకుస్థాపనలు చేశారు. ఇదే సందర్భంగా మండల ప్రజాపరిషత్ ఆఫీస్‌లో అన్ని శాఖల అధికారులు బీర్ల ఐలయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం ఫంక్షన్ హాల్లో విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని కొత్త ఆరోగ్య ఉపకేంద్రం, ముదిరాజుల సంఘ భవనం, వీరనారి చాకలి ఐలమ్మ ఆదర్శ రజక సహకార సంఘ భవనం,శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘ నూతన భవనాలను ప్రభుత్వ విప్ అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బునాది కాలువ పనులను వచ్చే నెలలో ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు ఉన్నా.. లేకున్నా నా సొంత నిధుల తో బునాది గాని కాలువ పనులను ప్రారంభిస్తామని అయిలయ్య తెలిపారు. 50 వేల ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించిన ఆత్మకూరు మండల ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తన గెలుపున కు కృషి చేసిన మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోజూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ నిధులతో పాటు బీర్ల ఫౌండేషన్ తో గ్రామాలు అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి డీసీసీ ప్రెసిడెంట్ అండెం సంజీవ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ఆత్మకూరు ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొని మాట్లాడారు.



# డ్రగ్స్ ముఠా అరెస్ట్

- బర్త్ డే, న్యూఇయర్ వేడుకల కోసం మాదకద్రవ్యాల కొనుగోలు
- హైదరాబాద్ లో విక్రయించేందుకు ప్లాన్
- పోలీస్ కమిషనర్ హెచ్చరించిన రెండో రోజే చర్యలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో డ్రగ్స్ ముఠాను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. నూతన సంవత్సర వేడుకల కోసం డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు ప్లాన్ చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. ఈ ముఠా రాజస్థాన్ నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్ లో అమ్మాలని చూస్తున్నట్లు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. ఇద్దరు నిందితులు శశిపాల్ బిష్ణోయ్, మదన్ లాల్ బిష్ణోయ్ లను అరెస్ట్ చేశామని, ఓపియం డ్రగ్ 3.4 కేజీలు, 45 గ్రాముల పాపి స్ట్రాప్ పౌడర్ ను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. అలాగే, రూ.2.8 లక్షల నగదు సీజ్ చేశామని చెప్పారు. శశిపాల్ గతంలోనూ డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయ్యాడని, బస్ ద్వారా డ్రగ్స్ హైదరాబాద్ కు తెస్తున్నారని పేర్కొన్నారు. సీఎం ఆదేశాలతో డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నామని, మత్తు పదార్థాల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కొత్త సంవత్సర వేడుకల క్రమంలో పబ్స్ పై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

**ఎస్సార్ నగర్ లోనూ**

ఎస్సార్ నగర్ లోని ఓ సర్వీస్ అపార్ట్మెంట్ లోనూ నార్కోటిక్ బ్యూరో అధికారులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. కొందరు యువకులు బర్త్ డే పార్టీ కోసం గోవా నుంచి ఎక్స్టసీ పిల్స్ తీసుకొచ్చి పట్టుబడ్డారని అధికారులు తెలిపారు. వీరంతా నెల్లూరు జిల్లాకు చెందిన వారేనని, వీరిలో 12 మంది ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు ఉన్నట్లు చెప్పారు. ప్రేమ్ చంద్ అనే వ్యక్తి బర్త్ డే కోసం సంపత్ అనే వ్యక్తి గోవా నుంచి డ్రగ్స్ తెప్పించాడని, 30 మంది కోసం ప్రేమ్ చంద్ డ్రగ్స్ పార్టీని ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు.

**నిరంతర నిఘా**

అటు, డ్రగ్స్ నియంత్రణపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. రాష్ట్రంలో డ్రగ్స్ పూర్తిగా నిర్మూలించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి ఎక్సైజ్, నార్కోటిక్ అధికారులతో తాజాగా సమావేశం నిర్వహించారు. నార్కోటిక్ టీంను అక్టోపస్ గ్రేహౌండ్స్ లా బలోపేతం చేస్తామని, డ్రగ్స్ పూర్తిగా నిర్మూలించి తెలంగాణ పోలీస్ దేశానికే రోల్ మోడల్ గా నిలవాలని ఆయన చెప్పారు.

**పబ్స్, బార్లపై ప్రత్యేక నిఘా**

డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా పోలీసులు పబ్స్, బార్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇటీవల, హైదరాబాద్ లోని పబ్బుల్లో వెస్ట్ జోన్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తొలిసారిగా తనిఖీల్లో స్నిఫర్ డాగ్స్ వినియోగించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎక్కడా మత్తు పదార్థాల వినియోగం లేకుండా పటిష్ట నిఘా ఉంచుతున్నారు. పబ్స్, బార్లలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని యజమానులను హెచ్చరిస్తున్నారు. గతంలో డ్రగ్స్ కేసులతో సంబంధం ఉన్న పబ్స్ పై నిఘా తీవ్రం చేశారు. కేవలం పబ్స్, బార్లలోనే కాకుండా సిటీకి దూరంగా ఉండే ఫాం హౌస్ లపైనా ప్రత్యేక దృష్టి సారించనున్నారు.



# 'యువగళం' చరిత్రలో నిలుపుదాం

- ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర బహిరంగ సభను చరిత్రలో నిలుపుదామని ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ యువత ఆశయాలకు అద్దం పట్టే ప్రజాగళంగా మారుద్దామన్నారు. ఒక్క అడుగుతో మొదలై యువత ఆకాంక్షలకు, ఆశయాలకు నిలువుటద్దంగా నిలిచిందని తెలిపారు. 226 రోజులపాటు ప్రజలకు భరోసా కల్పిస్తూ 3132 కిలో మీటర్లు విజయవంతంగా సాగిందన్నారు. విజయనగరం జిల్లా పోలేపల్లిలో నిర్వహిస్తున్న యువగళం నవశకం సభను చారిత్రాత్మకంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ , హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



# జూరాల నుంచి నీళ్లు వదలండి

**రోడ్డెక్కిన పెబ్బేరు రైతులు**

**విశాల భారతి, హైదరాబాద్:** జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ పరిధిలోని పంటలకు నీరందకపోవడంతో వనపర్తి జిల్లా పెబ్బేరు మండలానికి చెందిన రైతన్నలు రోడ్డెక్కారు. సోమవారం పట్టణంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతిచ్చారు. డీ19 కాల్వ కింద పెంచికలపాడు, జనుంపల్లి, మునగమాన్‌దిన్నె, సూగూరు, కొత్తసూగూరుతోపాటు పలు గ్రామాల పరిధిలో సుమారు 2వేల ఎకరాల్లో మిరప, ఇతర పంటను సాగు చేసినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం పంట చేతికొస్తున్న దశలో జూరాల అధికారులు వారం రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నీరందక పంటల సాగు ప్రశ్నార్థకమై ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వారబంది ప్రకారం ఫిబ్రవరి 15 వరకు జూరాల నీరు విడుదల చేయాల్సి ఉందన్నారు. అనంతరం ఎస్ఈ సత్యశీలారెడ్డికి వినతిపత్రం అందజేయగా.. నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



# బీర్ల ఐలయ్యకు కాంగ్రెస్ నాయకుల సన్మానం

**మేడిపల్లి,విశాలభారతి:** తెలంగాణ సార్వత్రిక ఎన్నికలలో ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్య భారీ మెజార్టీతో విజయం సాధించాడు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ సామాజిక వర్గానికి చెందిన బీర్ల ఐలయ్యను ప్రభుత్వ విప్ గా ఎన్నిక చేశారు.ఈ సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప ఆధ్వర్యంలో బిర్లా ఐలయ్యను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆసర్ల బీరప్ప మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలోని బడుగు,బలహీన వర్గాలకు నేనున్నానంటూ బీర్ల ఐలయ్య ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల అభిమానాన్ని,ఆశీర్వాదాన్ని పొంది బారి మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలవడం చాలా సంతోషకరమని,బీర్ల ఐలయ్య నాయకత్వంలో ఆలేరు నియోజకవర్గం అన్ని రంగాలలో ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధిస్తుందని ఆశాభవాన్ని వ్యక్తం చేస్తూ,భవిష్యత్తులో బీర్ల ఐలయ్య ఇలాగే ప్రజలకు సేవ చేస్తూ రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో గవ్వల రవి కుమార్, మజ్జిగ బలరాం,సిద్దులు,రాంపల్లి రమేష్ గౌడ్,జీగురు స్వామి, మహేందర్,వెంకటేష్,శ్రీధర్,అరుణ్, నరేష్,మధు తదితరులు పాల్గొని బీర్ల ఐలయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



# అంజన్ కుమార్ యాదవ్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- 18 శాతం ఉన్న యాదవులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి
- మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ లీడర్ బట్టు జగన్ యాదవ్



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఏ కార్యక్రమమైనా ముందుండి సక్సెస్‌చేసి, పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన ఎం. అంజన్ కుమార్ యాదవ్ కి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్‌యూత్‌లీడర్ బట్టు జగన్ యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా తెలంగాణలో 18 శాతం ఉన్న యాదవ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. సోమవారం హైదరాబాద్ ఆదర్శనగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ ఎంపీ ఎం. అంజన్ కుమార్ యాదవ్ ఏర్పాటు చేసిన పార్టీ విజయోత్సవ ఆత్మీయ సమ్మేళనం లో జగన్‌యాదవ్‌పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ లోకేశ్‌యాదవ్, చరణ్ కౌశిక్ యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి బైకని లింగం యాదవ్, గౌరి సతీష్, గట్టుప్పల్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు పంకెర్ల ఐలయ్య యాదవ్, చండూరు మండల యాదవ సంఘం అధ్యక్షుడు ఆవుల అశోక్, అచ్చిన ఐలయ్య యాదవ్, సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అటల్ పెన్షన్ పై ఎందుకంత నిర్లక్ష్యం

- లోక్ సభలో ప్రశ్నించిన నామా నాగేశ్వరరావు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అటల్ పెన్షన్ యోజన(ఏపీవై) పథకంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామ నాగేశ్వరరావు తెలిపారు. ఏపీవై పథకంపై కేంద్రానికి చిత్తశుద్ధి లోపించిందని మండిపడ్డారు. అమలు తీరు, సభ్యుల సంఖ్య పెరుగుదలకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై కేంద్రాన్ని సోమవారం లోక్‌సభలో నామ ప్రశ్నించారు. అటల్ పెన్షన్ యోజన పథకం నిధుల వివరాలు వెల్లడించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకానికి నిధులు ఏ మేరకు సమకూరుస్తుందో తెలియజేయాలని, రాష్టాల వారీగా సమగ్ర సమాచారం అందించాలన్నారు. ఐదేండ్లుగా రాష్ట్రాలకు కేటాయించిన నిధుల వివరాలు ఇవ్వాలని కోరారు. పథకం కింద కనీస పెన్షన్‌ను పెంచడానికి, ఎకువ మంది సభ్యులు చేరి, ప్రయోజనం పొందేలా ప్రోత్సహించడానికి ఏదైనా ప్రతిపాదన ఉందా? అని ఎంపీ నామ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే 2021, 2022, 2023 సంవత్సరాల్లో పథకానికి ప్రభుత్వ కో కంట్రిబ్యూషన్ నిధులు ఎందుకు కేంటాయించలేదని కేంద్రాన్ని నిలదీశారు. చివరికి... పెన్షన్ ఆస్తుల మధ్య అంతరాన్ని పూడ్చేందుకు ఉద్దేశించిన గ్యాప్ ఫండ్‌కు కూడా నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తుందన్నారు. పెన్షన్ సబ్ స్రిప్షన్ మొత్తాన్ని పెంచడానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. సభ్యులు ఎంచుకున్న ఆధారంగా కనీస హామీ పెన్షన్‌ను అందిస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కరాద్ సమాధానమిచ్చారు. పథకానికి సంబంధించిన కో కంట్రిబ్యూషన్ నిధులు, బ్యాంకులకు ప్రోత్సహక చెల్లింపులు చేస్తున్నట్లు చెప్పారు. వేరే చట్టబద్ధ సామాజిక భద్రతా పథకంలో సభ్యులు కాని వారిని, ఆదాయపు పన్ను కట్టకుండా అర్హత ఉన్న వారిని ఇందులో సభ్యులుగా చేర్చుకున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు. అయితే.. కేంద్రం రాష్టాల వారీగా సమగ్ర సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీ నామ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



## గెలుపు కు కృషి చేసిన ప్రతి ఒకరికి రుణపడి ఉంటా

**విశాలభారతి కొత్తూరు:** ఈ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తన గెలుపు కోసం నిరంతరం కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని షాద్ నగర్ ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పెంజర్ల గ్రామానికి సందర్శించిన అయన పెంజర్ల గ్రామస్తుల తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లోప్రచారం నిర్వహించి తన గెలుపు కోసం కృషి చేశారని తెలిపారు. ఎన్నికల్లో తాను గెలు పొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎల్బీన గర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా గుర్తించి పరిష్కరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ ట్రూపుల్ షూటర్ శ్యామసుందర్ రెడ్డి,మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిళ్ళ వసంత సీనియర్ నాయకుడు సిద్దార్థ్ రెడ్డి,ఎంపీటీసీ దేశాల అంజమ్మ,ఉప సర్పంచ్ పాముల రమేష్, మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రోళ్ల జగన్,దేశాల రమేష్, శ్రీకాంత్ రెడ్డి,కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దందాలో డీలర్లు...?

- రేషన్ కు బదులు లబ్ధిదారులకు డబ్బులు చెల్లింపు
- అధికారుల కనుసన్నల్లోనే దందా అంటూ ఆరోపణలు



**భీమదేవరపల్లి, విశాల భారతి:** నిరుపేదలు ఆకలి బాధను అనుభవించవద్దని, ప్రతి పేద కుటుంబం కడుపు నిండా తినాలని ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో లబ్దిదారులకు అందాల్సిన రేషన్ బియ్యం, డీలర్లు అక్రమ దందా చేసే గుత్తేదార్లు ఏకమై ప్రజలను దోచుకుతింటున్నారు. రేషన్ కోసం వెళ్లిన లబ్దిదారులకు బియ్యం బదులు డబ్బులు చెల్లించి పంపిస్తున్న సంఘటనలు ఎన్నో చోటు చేసుకుంటున్నా, ఆ దొడ్డు బియ్యం తినలేక డబ్బులే సరి అనుకోవడంతో లబ్దిదారులకు కిలోకు 10 రూపాయలు డీలర్లు చెల్లించి, అక్రమార్కులకు కిలోకు 15 నుంచి 18 రూపాయల చొప్పున అమ్ముకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ దందా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటే అధికారులకు వాటా ఉందేమోనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డీలర్ల దగ్గర కొన్న రేషన్ బియ్యం వేరే రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు అని వాపోతున్నారు.

## ఎవరినీ వదిలిపెట్టం

మొదటిపేజీ తరువాయి

చేశారు. రాష్ట్రానికి సంబంధించిన భారీ నీటి ప్రాజెక్టులో నాసీ రకం పనులు ఎలా చేస్తారని, నాణ్యత లేకుండా ఎలా నిర్మిస్తారని నిలదీశారు. ఏదో ఒక లెటర్ అధికారులకు ఇచ్చి తమ ప్రమేయం ఏమీ లేదని తప్పించుకోవాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. ప్రజా ధనాన్ని వృధా చేసి ప్రాజెక్టు కూలిపోవడానికి కారణమైన ఎవరినీ వదిలిపెట్టమన్నారు.

ఈ నీటి ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మించిన ఏజెన్సీలనే కాకుండా.. అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు నిర్మించిన ఏజెన్సీలను కూడా పిలిచి మాట్లాడాలని అధికారులకు ఆదేశించారు. తప్పు చేసిన వారు తపించుకోవాలని చూస్తే న్యాయపరంగా, చట్ట పరంగా చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగిన విషయం మనకు తెలిసిందే. దీనిని కేంద్ర నుంచి వచ్చిన బృందాలు కూడా పరిశీలించాయి. తాజాగా మంత్రి చేపట్టిన సమావేశంతో ఎలాంటి పురోగతి ఉంటుందో వేచి చూడాలి.



## కాంగ్రెస్ పార్టీ కోసం ఎనలేని కృషి చేసిన బండారి ప్రకాష్ గౌడ్

**బండారి ప్రకాష్ గౌడ్ వర్ధంతి లో పాల్గొన్న బండి రమేష్**

**విశాలభారతి,కూకట్ పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గం లోని బాలానగర్ కి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి ప్రకాష్ గౌడ్ ఆరవ వర్ధంతి కార్యక్రమం లో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. బండారి ప్రకాష్ గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం బండారి ప్రకాష్ గౌడ్ చేసిన కృషినీ కొనియాడారు. మాజీ సీఎల్పీ నేత స్వర్గీయ పిజేఆర్ అనుచరుడుగా ఎంతో పేరు తెచ్చుకొని ప్రజల హృదయాలలో నిలిచి పోయాడని ప్రజల కోసం అహర్నిశలు తపించేవాడని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇలాంటి నాయకులు కొంతమంది మాత్రమే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సీనియర్ నాయకురాలు పుష్పారెడ్డి, నవీన్ గౌడ్, అబ్దుల్ బాకీ రమేష్ దీపక్ మహేందర్ అనిల్ నజీర్ తదితర నేతలు పాల్గొన్నారు.

## తొలిసారి కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంకు ఎమ్మెల్యే లాస్య నందిత

**సీఈఓ మధుకర్ నాయక్ దృష్టికి ప్రజా సమస్యలు**



విశాలభారతి,కంటోన్మెంట్ : కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన లాస్యనందిత తొలిసారి కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ మధుకర్ నాయక్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. తొలిసారిగా బోర్డు కార్యాలయానికి విచిన ఎమ్మెల్యే లాస్యనందితకు సీఈఓ మధుకర్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల గురించి ప్రస్తావించి రోడ్లు,డ్రైనేజీ, వాటర్ సమస్యలు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణం గురించిసీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే తెలుపుగా, మధుకర్ నాయక్ సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకురాలు నివేదిత, వంగల మల్లేష్, రవికుమార్, కర్ణ కుమార్, దేవులపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్లోని కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహానికి పూలమాల వేసి.. సంఘం నాయకులతో మీటింగ్ లో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్. ఈ కార్యక్రమంలో గుండు మోహన్, పత్రి రామకృష్ణ పరమేశ్వర్, శ్రీశైలం, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి**

**కూకట్ పల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి అన్నారు. వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రధాన డిమాండ్ మాదిగ సంఘాల ఐకాసా చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో సోమవారం న్యూఢిల్లీ లోని అంబేద్కర్ భవన్ దగ్గర జరిగిన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో మాదిగ సంఘాల నాయకులు కార్యకర్తలు తెలంగాణ రాష్ట్రంలో 30 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్న వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సందర్భంగా హైదరాబాదులో మాదిగల కు వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చారని గత పది సంవత్సరాల నుండి వర్గీకరణ అంశాన్ని కేవలం ఎన్నికల కోసమే బిజెపి అధినాయకత్వం మాదిగలను వాడుకుంటున్నారని, మాదిగల న్యాయమైన డిమాండ్ ఎస్సీ వర్గీకరణ అందరిని ద్రాక్షగా మిగిలిందని మాదిగల చిరకాల కోరికగా మిగిలిపోయిందని, ఈ పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, తమ ప్రధాన డిమాండ్ చేశారు. నేడు న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహా ధర్నా నిర్వహిస్తామని అందుకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మాదిగ సంఘాలు, కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం సంఘీభావం తెలుపుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిరసన కార్యక్రమాలను గుర్తించి వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టకపోతే ఆమరణ నిరాహార దీక్షకు వెనుకాడమని తెలిపారు. ఉషా మెహర కమిషన్ ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా సిఫార్సు చేసిందని కమిషన్ ఆధారంగానే ఈ పార్లమెంటులో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఇదే తమ ప్రధాన డిమాండ్ అని పిడమర్తి రవి అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాజకీయా వేదిక అధ్యక్షులు చంద్రశేఖర్, దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు బుదాల బాబురావు, ఎమ్మెస్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ, మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకులు దుబ్బయ్య,కురుపాటి సుదర్శన్, బుర్ర సురేష్, మాదిగ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కార్తీక్, బండి మోహన్ ,రవి కిరణ్, గద్దల రమేష్, తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు

## సీఎంకి అభినందనలు



**భద్రాచలం,విశాల భారతి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ మాఫియాను సమూలంగా అరికడతాం అని అసెంబ్లీ సాక్షిగా చెప్పటం పట్ల మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సఫలీకృతం అవుతున్నారని సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతల పైన కొరడా జూలిపించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని ఆమె అన్నారు. తెలంగాణలో గంజాయి వంటి మారకద్రవ్యాలు యదేచ్ఛగా చెక్ పోస్టు దాటుతున్నాయని ఒడిశా సతీష్‌గడ్ వంటి రాష్ట్రాల నుంచి వివిధ రూపాల్లో నిత్యం సరఫరా అవుతున్నాయని ప్రతి చోట పోలీసులకు పట్టుబడుతున్నారని ఆమె అన్నారు. అసలు మూలాలను కనిపెట్టి అంతమొందించాలని ఆమె అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు డ్రగ్స్ కు అలవాటు పడటం వలన యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని అందులో మధ్యతరగతి నిరుపేద కుటుంబాల వారి పిల్లలను టార్గెట్ చేస్తున్నారని భద్రాచలంలో కూడా కొన్ని ఏరియాలో గంజాయి సరఫరా అవుతుందని పోలీస్ ఉన్నతాధికారులు సోదాలు నిర్వహించి వాటిపైన దాడులు చేస్తూ చర్యలు చేపడుతున్న కూడా ఏదో ఒకచోట గంజాయి స్మగ్లింగ్ జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తపరిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ యావత్తు గర్వించే తట్టు ఉన్నాయని ఆమె తెలిపారు ఆయన పదవి కోసం కాకుండా ప్రజల కోసం ప్రగతి కోసం పడే తపన కొనియాడ తగ్గదని ఆమె అన్నారు అలాగే ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాల కళాశాలలోనూ విద్య అభ్యసించే విధంగా చర్యలు చేపట్టడం చంచలమైన విషయంగా ఆమె పేర్కొన్నారు సమతా మమతల సౌభ్రాతృత్వం రేవంత్ రెడ్డిని చూస్తే కనిపిస్తుందని సమానత్వం మాటలకే పరిమితమైన గత ప్రభుత్వాల పనితీరును ఎండగట్టే విధంగా ఆయన పని విధానం ఉందని రేవంత్ రెడ్డి తోటే సమ సమాజ స్థాపన సాధ్యపడుద్దని పేద ధనిక అనే బేధం లేకుండా అందర్నీ ఒక తాటిపైనే తీసుకొచ్చే విధానం తెలంగాణ ప్రాంతం రుణపడి ఉంటుందని తెలిపారు.



## నూతన గ్రామ పంచాయతి కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉమా ప్రవీణ్ రెడ్డి

- ముఖ్య అతిథిగా పాల్గొన మాజీ జడ్పీ వైస్ చైర్మన్
- నాగర్ కుంట నవీన్ రెడ్డి

**విశాలభారతి, కొత్తూరు:** నందిగామ మండల పరిధిలోని మొదలగూడ గ్రామపంచాయతి లో నూతన నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని పాలకవర్గం మరియు ఎంపీటీసీ తో కలిసి మాధవి రవీందర్ తో కలిసి ప్రారంభించిన ఉమా ప్రవీణ్ రెడ్డి ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నూతన హంగులు తో నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి గా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి లో ఉప సర్పంచ్ షఫీ సోఫియా, వార్డ్ సభ్యులు శ్రీను, అబ్బాస్, రాజు, భాగ్యమ్మ,సునీత, యాదమ్మ, శ్రీరాములు, కో ఆప్షన్ మెంబెర్ ఆంజనేయులు గౌడ్, పాల్గొన్నారు..

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**చిగురుమామిడి, విశాల భారతి:** కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారంగా వెలుగొందుతునన్న కరీంనగర్ జిల్లా చిగురుమామిడి స్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దివ్యక్షేత్రంలో షష్ఠి తిథిన సోమవారం మార్గ షిర శుక్ల పక్ష షష్ఠి తిది సుబ్రహ్మణ్యస్వర స్వామి వారి జన్మదినం కావటంతో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను గురూజీ ఉమేష్ స్వామి చేతుల మీదుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమితి సుబ్రహ్మణ్య స్వామికి అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కోహెడ మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కనకా రెడ్డి కుటుంబ సభ్యులు 10వేల రూపాయలు ఆలయానికి విరాళంగా అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక హోమం కార్యక్రమం నిర్వహించుకొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ పూజలో ఆలయ ధర్మకర్తలు మోహన్ రెడ్డి, తెరాల సత్య నారాయణ,తేరాలా అమర్,సునీల్ కుమార్,ప్రవీణ్ కుమార్,కోనేటి సాగర్,పెసరి సంతోష్, స్వామి,గుంటి పల్లి సంతోష్, మోటం రాజు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ తోనే ఆర్టీసీ అభివృద్ధి

**టి ఎస్ ఆర్ టి సి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దుబ్బాక యాదయ్య.**

**ముషీరాబాద్,విశాలభారతి:** గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం నికి గురైన ఆర్టీసీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తోనే మళ్ళీ అభివృద్ధి చెందుతుందని టిఎస్ ఆర్టిసి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దుబ్బాక యాదయ్య పేర్కొన్నారు. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవిలో స్థానం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ గౌరవాధ్యక్షులైన వివేక్ వెంకటస్వామి ని హైదరాబాదులోని తన నివాసంలో అసోసియేషన్ ప్రతినిధులు కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుబ్బాక యాదయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో యూనియన్లు లేకుండా చేసిన ఘనత కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. హక్కుల కోసం యూనియన్లు ఏర్పడితే ఆ యూనియన్లు లేకుండా హక్కులను కాలరాచారని అందుకు తగిన గుణపాఠం ప్రజలు చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో వచ్చిన మార్పు కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆర్టీసీకి మంచి రోజులు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి పద్మారావు, వల్లూరి బాబు, రవీందర్, నాగ శేషు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్

**కూకట్ పల్లి,విశాలభారతి:** కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తూరు సీతయ్య నగర్ లో రూ. 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో అల్లాపూర్ డివిజన్ లోని బస్తీలలో, కాలనీలలో మౌలిక సదుపాయాలతో కూడుకున్న అభివృద్ధి పనులను పూర్తి చేసుకోగలుగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, రొయ్యల శివ, మడపతి యోగి రాజు, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
5
మంగళవారం,
19.12. 2023
హైదరాబాద్

# కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్న సిపిఎం

- సిపిఎం కార్యాలయాలు ప్రజా పోరాట కేంద్రాలు
- ఎర్రజెండాను ఎగరవేస్తాం



**మోతె, విశాల భారతి:** ప్రజా చైతన్యంతో పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. సోమవారం సిపిఎం పార్టీఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా మోతె మండలం రావి పహాడ్ గ్రామంలో గత ఏడు సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ పార్టీ నాయకులు అక్రమంగా ఆక్రమించుకున్న పార్టీ కార్యాలయాన్ని సిపిఎం నాయకులు గ్రామ, మండల, జిల్లా నాయకులు కలిసిపార్టీ కార్యాలయానికి ఎర్ర రంగు వేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాల క్రితం మోతే మండలం రావిపహాడ్ గ్రామంలో ప్రజల సహకారంతో నిర్మించుకున్న పార్టీ కార్యాలయాన్ని గత ఏడు సంవత్సరాల క్రితం సిపిఎం నాయకులు కొద్దిమంది బి ఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఆ నాయకులు అక్రమంగాపార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిరిగి ఏడు సంవత్సరాల తర్వాత సిపిఎం పార్టీ నాయకులు చొరవ తీసుకొని పార్టీ కార్యాలయాల్లోకి ప్రవేశించారు. గత పాలకులు నిరంకుశంగా వ్యవహరించారని దీని మూలంగా ప్రజాగ్రహానికి గురైన ప్రజలు చారిత్రాత్మక తీర్పును ఇచ్చారని అన్నారు. ప్రజల సహకారంతో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని అక్రమంగా ఆక్రమించిన విషయమై అనేకసార్లు గత అధికార పార్టీ నాయకులకు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలని గతంలో వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగా రెడ్డి, మల్లు లక్ష్మి తో పాటు అనేక మందిని అక్రమంగా అరెస్టు చేయించారని అన్నారు. సిపిఎం కార్యాలయం మా గ్రామంలో ఉండాలని అది ఉంటేనే పేదలకు, రైతులకు,వ్యవసాయ కార్మికులకు,వృత్తిదారులకు న్యాయం జరుగుతుందని భావించిపెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలివచ్చి కార్యాలయం స్వాధీన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలుతెలియజేశారు. రానున్న ఎన్నికల్లో రావిపహాడ్ గ్రామంలో ఎర్ర జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఎన్ని నిర్బంధాలు వచ్చిన వాటికిభయపడకుండాపార్టీ వైపు నిలిచిన కామ్రేడ్స్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సిపిఎం జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి, దండ వెంకటరెడ్డి, జె.నరసింహారావు, సిపిఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు కాంపాటి శ్రీను, గుంట గాని ఏసు, సోమ గాని మల్లయ్య, వెలుగు మధు చేగువేరా, జంపాల స్వరాజ్యం, రేపాల వెంకన్న,నాయకులు ఎర్రబోయిన మల్సూర్,శీలం సతీష్, అర్వపల్లి లింగయ్య, సంగయ్య,రాములు,గోపయ్య, ముత్తయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల శ్రేయస్సే పిఆర్టియు లక్ష్యం

**పిఆర్టియు తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా భిక్షంగా గౌడ్**

**నల్లగొండ, విశాలభారతి:** ఉపాధ్యాయుల శ్రేయస్సే పిఆర్టియు తెలంగాణ లక్ష్యమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ అన్నారు. ఆదివారం రోజు రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం లో ఓటింగ్ ద్వారా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా చిట్యాల మండలానికి చెందిన సుంకరి బిక్షం గౌడ్ ఘన విజయం సాధించి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బిక్షం గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం అలుపెరగని పోరాటం చేస్తానని త్వరలో అర్ధంతరంగా ఆగిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు సజావుగా జరిగేట్లు కృషి చేస్తానని, సిపిఎస్ రద్దు, 317 బాధితులకు న్యాయం జరిగేటట్లు పియార్టియు తెలంగాణ కృషి చేస్తుందని తెలియచేసారు. ఈ సమావేశం లో రాష్ట్ర కమిటీ సభ్యులు గా చిట్యాల మండలం నుండి అసోసియేట్ అధ్యక్షులు 1 గా దంతూరి సైదులు గౌడ్, అసోసియేట్ అధ్యక్షులు 2 గా మల్లికార్జున్, ఉపాధ్యక్షులు గా కృష్ణమూర్తి లు ఎన్నిక కావడం జరిగింది. ఈసందర్భంగా వారికీ నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాదం బిక్షపతి, చిట్యాల మండల శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శిలు రెబల్లె శరత్, బండ విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పంతంగి కరుణాకర్ గౌడ్, గరిశే అంజయ్య అభినందనలు తెలియచేసారు.

## ఉపాధ్యాయునిపై చర్య తీసుకోవాలి



**మోతె, విశాల భారతి:** విద్యార్థులకు పాఠాలు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు సొంత పనులకు విద్యార్థుని ఉపయోగించుకోవడంతో విద్యార్థి గాయాలపాలైన సంఘటన మోతే మండలం రాఘవాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మోతె మండలం రాఘవాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నిమ్మల శ్రీనివాస్ ఆ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి బూడిద భాను కౌశిక్ ను కరివేపాకు తీసుకు రమ్మని ఉపాధ్యాయుడు పంపడంతో చెట్టు ఎక్కి కాలుజారి క్రింద పడడంతో తలకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగాబాలుడితండ్రి బూడిద లింగయ్య మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులను సొంత పనులకు ఉపయోగించుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. విద్యార్థులను సొంత పనులకు ఉపయోగించిన ఉపాధ్యాయుడు నిమ్మల శ్రీనివాస్ ను వెంటనే విధుల నుండి తొలగించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల సహకారంతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## దేవాలయాల చైర్మన్ ల ఏకగ్రీవ ఎన్నిక



మునగాల, విశాల భారతి: మండల పరిధిలోని రేపాల గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రేపాల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి, వెంకటేశ్వర స్వామి, శివాలయాలం, ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ గా సారిక చిన్న రామయ్య, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా గండు జితేందర్, ఆంజనేయ స్వామి చైర్మన్ గా మేక నరేందర్ రెడ్డి, శివాలయం చైర్మన్ గా మెరుగు ముత్తయ్య లను ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్లు మాట్లాడుతూ గ్రామంలో అందరి సహకారంతో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఎన్నికైన చైర్మన్లను గ్రామ ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ స్థాయి మీటింగ్లో పాల్గొన్న చావా

**పాలేరు, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టరేట్లో సోమవారం పాలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి మీటింగ్ జరిగింది. ఇట్టి కార్యక్రమానికి పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివ రామకృష్ణ హాజరై పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు. శివకృష్ణ మాట్లాడుతూ.. మంత్రిగా పొంగులేటి తొలి సమీక్ష నియోజకవర్గంలో ప్రత్యేక ఫోకస్ పెట్టారని ఇక్కడ ఎక్కువ భూ ఆక్రమణలు పెద్ద ఎత్తున జరిగాయని తీవ్ర ఆరోపణలు ఉన్నాయని వాటితోపాటు అభివృద్ధిలో తప్పిదాలు జరిగినట్టు వారి దృష్టిలో ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సమస్యలు ఉన్నందున వాటిని పరిష్కరించాలని ఈ నెల 28 న మరో రెండు గ్యారెంటీలను నెరవేర్చబోతున్నామని ఈ సంక్రాంతికు ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని అన్నారని తెలిపారు.



## నారాయణ మృతి సీపీఎం తీరని లోటు

**మునగాల, విశాల భారతి:** మండల కేంద్రానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, గీతా కార్మిక సంఘం డివిజన్ మాజీ అధ్యక్షులు నారగాని నారాయణ(74) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. నారాయణ మృతికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన భౌతికాయానికి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ తుదిశ్వాస విడిచేవరకు పార్టీకి అంకితమై పనిచేశారని కొనియాడారు. పలు నిర్బంధాలను ఎదుర్కొని పార్టీ పురోభివృద్ధి కోసం పనిచేశారని తెలిపారు. కూలీల వేతనాల పెంపు కోసం వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. ఆయన మృతి పార్టీ ప్రజా సంఘాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. నారాయణ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. మృతునికి భార్య, నలుగురు కుమారులు, కుమార్తె వున్నారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొని నారాయణకు జోహార్లర్పించారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మునీర్ ఎంపిక

**అభినందించిన సెయింట్ అగస్టీన్స్ పాఠశాల యాజమాన్యం**



**మరిపెడ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మరిపెడ పెయింట్ అగస్టీన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్కే మునీర్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ దీన వ్యాయామ ఉపాధ్యాయుడు సుమన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో ఎస్కే మునీర్ 14 సంవత్సరాల బాలుర విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో స్థానం దక్కించుకున్నట్లు వారు పేర్కొన్నారు. త్వరలో జనగామ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి పాల్గొంటారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. చదువులతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందించదగిన విషయమని సిస్టర్ దీన అన్నారు. మునీర్ ను అభినందించిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్, షీనాటోమ్ ,వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్రాన్సీ, సిస్టర్లు జోశ్విన్, ట్విన్సీ, జ్యోతిష్, ఆగ్నస్, పాఠశాల స్టాఫ్ సెక్రటరీలు ప్రసాదరావు, రాణి ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

## సీఎంకి అభినందనలు



**భద్రాచలం,విశాల భారతి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ మాఫియాను సమూలంగా అరికడతాం అని అసెంబ్లీ సాక్షిగా చెప్పటం పట్ల మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సఫలీకృతం అవుతున్నారని సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతల పైన కొరడా జూలిపించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని ఆమె అన్నారు. తెలంగాణలో గంజాయి వంటి మారకద్రవ్యాలు యదేచ్ఛగా చెక్ పోస్టు దాటుతున్నాయని ఒడిశా సతీష్ గడ్ వంటి రాష్ట్రాల నుంచి వివిధ రూపాల్లో నిత్యం సరఫరా అవుతున్నాయని ప్రతి చోట పోలీసులకు పట్టుబడుతున్నారని ఆమె అన్నారు. అసలు మూలాలను కనిపెట్టి అంతమొందించాలని ఆమె అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు డ్రగ్స్ కు అలవాటు పడటం వలన యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని అందులో మధ్యతరగతి నిరుపేద కుటుంబాల వారి పిల్లలను టార్గెట్ చేస్తున్నారని భద్రాచలంలో కూడా కొన్ని ఏరియాలో గంజాయి సరఫరా అవుతుందని పోలీస్ ఉన్నతాధికారులు సోదాలు నిర్వహించి వాటిపైన దాడులు చేస్తూ చర్యలు చేపడుతున్న కూడా ఏదో ఒకచోట గంజాయి స్మగ్లింగ్ జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తపరిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ యావత్తు గర్వించే తట్టు ఉన్నాయని ఆమె తెలిపారు ఆయన పదవి కోసం కాకుండా ప్రజల కోసం ప్రగతి కోసం పడే తపన కొనియాడ తగ్గదని ఆమె అన్నారు అలాగే ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాల కళాశాలలోనూ విద్య అభ్యసించే విధంగా చర్యలు చేపట్టడం చంచలమైన విషయంగా ఆమె పేర్కొన్నారు సమతా మమతల సౌభ్రాతృత్వం రేవంత్ రెడ్డిని చూస్తే కనిపిస్తుందని సమానత్వం మాటలకే పరిమితమైన గత ప్రభుత్వాల పనితీరును ఎండగట్టే విధంగా ఆయన పని విధానం ఉందని రేవంత్ రెడ్డి తోటే సమ సమాజ స్థాపన సాధ్యపడుద్దని పేద ధనిక అనే బేధం లేకుండా అందర్నీ ఒక తాటిపైనే తీసుకొచ్చే విధానం తెలంగాణ ప్రాంతం రుణపడి ఉంటుందని తెలిపారు.



## వంద అడుగుల జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇయ్యాలి.
- మంత్రి పొన్నం ప్రభాకర్ కోరిన బీసీ సంఘాల నాయకులు.

**ముషీరాబాద్,విశాల భారతి:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో వంద అడుగుల జ్యోతిబాపూలే విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేయాలని బీసీ కులాల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ను వివిధ బీసీ సంఘాల నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్, చిన్న శ్రీశైలం యాదవ్, బాలరాజ్ గౌడ్, శేఖర్ సగర, సింగం నరేష్, లింగంగౌడ్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపి బీసీల సమస్యలను వివరించారు. అనంతరం కుందారపు గణేష్ చారి మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధిని కోరుకునేది ఒక కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 2000 కోట్ల రూపాయలతో సబ్ ప్లాన్ ఏర్పాటు చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలానే విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో వెనుకబడిన బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఏర్పాటు దిశగా మంత్రి చర్యలు చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తదితరులు భారీగా పాల్గొన్నారు.



## పాత పెన్షన్స్ కోసం ఉద్యమిస్తాం

- రిటైర్డ్ ఉద్యోగుల ఫెన్షనర్స్ అసోసియేషన్
- రాష్ట ప్రధాన కార్యదర్శి టి సీతారాం

**మరిపెడ, విశాలభారతి:** పాత పెన్షన్స్ విధానాన్ని కొనసాగించాలని దీనిని తిరస్కరించాలని చూస్తే ప్రభుత్వాన్ని గాదెదించే వరకు పోరాడుతామని ఆల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సీతారాం అన్నారు. సోమవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పెన్షనర్స్ పితామహుడు నకరా జయంతి సందర్భంగా ఘనంగా పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి గుగులోతు అరుణ రాంబాబు లను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సీతారాం పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని అవలంబిస్తుందని ఆయన ఆరోపించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని గత 11 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న ఈ ప్రభుత్వానికి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని తిరస్కరించాలని చూస్తే ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఏటిఓ నవీన్ కుమార్, ఎంపీడీవో కే దన్ సింగ్, ఎంపీపీ అరుణ రాంబాబులు హాజరు కాగా. సీనియర్ పెన్షనర్స్ లైన వై రామ్మూర్తి, జి వెంకట్ రెడ్డి, ఆర్ రాములమ్మ, ఎన్ వెంకటయ్య లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె వీరయ్య, మండల అధ్యక్షులు గాదె అశోక్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గౌడిశాల వీరయ్య, తొర్రూరు ప్రధాన కార్యదర్శి కే వెంకటాచారి, కోశాధికారి కొమరయ్య, రాములు, పాల్గొన్నారు.



## అమ్మ నాన్న గురువు పద్యార్చన

**శాలిగౌరారం, విశాలభారతి:** మండలం మనిమద్దె జడ్పి స్కూల్ విద్యార్థులు రచయిత చిగురుమళ్ళ శ్రీనివాస్ వ్రాసిన అమ్మ నాన్న గురువు పద్యార్చన చేశారు. సోమవారం ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు వివిధ పాఠశాల్లో పద్యార్చన చేశారు.ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానాతో పాటు 100 దేశాల్లోని సమన్వయంతో వందే విశ్వమాతరం పేరుతో చిగురుమళ్ళ శ్రీనివాస్ 100 దేశాల్లో నిర్వహిస్తున్న శాంతి సదభవన యాత్రలో భాగంగా అన్ని పాఠశాల్లో అమ్మ నాన్న గురువు పద్యార్చన కార్యక్రమాన్ని విద్యార్థులు చేస్తున్నారు. అందులో భాగంగానే మనిమద్దే పాఠశాలలోని 15 మంది విద్యార్థులు కంఠస్థం తోసామూహిక పద్యార్చన గానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తెలుగు పండిట్ పద్య సమన్వయ కర్త మారోజు వెంకటాచారి మాట్లాడుతూ విద్యార్థులకు అమ్మ నాన్న గురువు పెద్దల పట్ల గౌరవం పెంచడానికి విద్యార్థులకు సన్మార్గం లో నడవడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల హెచ్ ఎం వెంకట రమణ రెడ్డి ఉపాధ్యాయులు సైదులు,సైదయ్య,వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మిర్యాలగూడ, విశాలభారతి:** ఉద్యోగుల డీఏ, ఇతర పెండింగ్ బిల్లుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. టీఎన్ జీవో మిర్యాలగూడ డివిజన్ అర్బన్, రూరల్ అధ్యక్షులు సైదులు గంగపుత్ర, నారాయణ స్వామి, మాజీ జిల్లా కార్యదర్శి కె .చంద్రా రెడ్డి,కార్యదర్శులు మధుసూధన చారి, నుస్రత్ అలీ తో పాటు ఇతర ఉద్యోగులు సోమవారం స్థానికంగా ఎమ్మెల్యే ను కలిసి విషెస్ చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలను, ప్రభుత్వ పాలసీలను ప్రజల వద్దకు చేరవేసే భాధ్యత ఉద్యోగులదే అందుకు ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథం తోనే వ్యవహరిస్తోందన్నారు.
ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి , ప్రజలకు మధ్య వారదులుగా ఉంటు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు హబీబ్, రామ కృష్ణా రెడ్డి, సహాధ్యక్షులు జానిపాష, కోశాధికారులు కృష్ణ నాయక్, అజీముద్దిన్,అహ్మ దుల్ల, ప్రసాద్, మౌలాన, దయాకర్ రెడ్డి, సైదులు, సోమ్లా నాయక్,నాగజ్యోతి, రాహుల్, రాంకోటి,శివలింగం,వెంకటేశ్వర్లు,నాగుల్ మీరా, రవి, మల్లికార్జున్, సిరాజ్, శరణ్ , రమేష్ ఉన్నారు.

# అక్రమ నిర్మాణాలు తొలగించాలి

- కెనాల్ మీద అక్రమ నిర్మాణం చేపట్టిన PSR పాఠశాల యాజమాన్యం మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- ద్యార్థి సంఘాల జేఏసీ, వెలికట్ట గ్రామస్తుల ఆధ్వర్యంలో ధర్నా



**తొర్రూర్,విశాల భారతి:** డిబిఎం 59 కెనాల్ మీద అక్రమంగా నిర్మించిన పాఠశాల ప్రవేశ ద్వారము మరియు కెనాల్ మీద కంచెలతో నిర్మాణం చేసిన ప్రహరీని తొలగించాలని గత నాలుగు ఐదు నెలల నుండి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఏఈఈ నుండి మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకు అందరికీ ఫిర్యాదు చేసిన ఎటువంటి ఫలితం రాలేదని తొర్రూరు విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన ప్రదేశం దగ్గర ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ జేఏసీ నాయకులు బందు మహేందర్(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి సభ్యులు, మాలోతు సురేష్ బాబు(ఆప్ విద్యార్థి విభాగం) రాష్ట్ర అధ్యక్షులు
గంగాధరి సిద్ధూ(ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మధు(ఎన్ ఎస్ యు ఐ) లు మాట్లాడుతూ గత పది ఏళ్ల బిఆర్ఎస్ సర్కార్ లో ఇష్టాను సారంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసి పేదలను ఇబ్బందులు పెట్టిన సందర్భం చూశామని నేడు ఆ కబ్జాల నుండి ప్రభుత్వ భూములు విముక్తి కావాలని అన్నారు. డిబిఎం 59 కెనాలి కాలువ కుడివైపున 44 ఫీట్లు ఉండాల్సిన భూమి 24 ఫీట్లకే పరిమితమైంద ని మిగతా భూమి దాదాపు ఒక ఎకరం పాటు దారిని పోనుగొటి సోమేశ్వరరావు కబ్జా చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు దారి కబ్జాకు గురి అయ్యింది అని తెలిసిన కూడా చర్యలు తీసుకోవడంలో చోద్యం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి పోనుగొటి సోమేశ్వరరావు మీద క్రిమినల్ కేసులను నమోదు చేసి అటువైపుగా దారిని తీయాలని రైతులు వేడుకుంటున్నారని పేర్కొన్నారు. కబ్జా చేసిన వ్యక్తి మీద చర్యలు తీసుకోకుండ అట్టి విషయం తెలియజేసిన వారిపైన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బందు వెంకన్న, యాసారపు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# కుష్టు వ్యాధి నిర్మూలనకు సహకరించాలి

**డీపీఎంఓ వనాకర్ రెడ్డి**

**తొర్రూర్, విశాల భారతి:** చాప కింద నీరులా విస్తరిస్తున్న కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ చెప్యాల వనాకర్ రెడ్డి అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పలువురు బాధితులకు సెల్ఫ్ కేర్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనాకర్ రెడ్డి మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని కోరారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ సహకరించి శాశ్వత లోపాలు, అంగ వైకల్య బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. తొలి దశలోనే చికిత్స అందించడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చన్నారు .ఈ కార్యక్రమంలో వైద్యులు మీరాజ్, జ్వలిత, ప్రియాంక, మానస, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వివేక్ వెంకట స్వామికి మంత్రి పదవి ఇవ్వాలి

**బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్**



**మిర్యాలగూడ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు అన్ని వర్గాలకు భరోసాగా నిలిచే వివాద రహిత నేత ప్రస్తుత చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామికి మంత్రి పదవి ఇవ్వాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కాంగ్రెస్ పార్టీని కోరారు. హైదరాబాదులోని సోమాజిగూడలో ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామిని కలిసి విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడారు.. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.



# తండ్రిని చంపిన కొడుకు అరెస్ట్

- ఆస్తి తగాదాలే మర్డర్ కు కారణం
- వర్ధన్నపేట ఏసీపీ రఘు చందర్

**పాలకుర్తి, విశాల భారతి:** కన్న తండ్రిని కర్రతో బాది చంపిన కసాయి కొడుకును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వర్ధన్నపేట ఏసీపీ డి.రఘు చందర్ తెలిపారు. సోమవారం పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్ లు పాల్గొనగా నిందితుడిని విలేకరుల సమక్షంలో ప్రవేశపెట్టారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. పాలకుర్తి మండలం సిరసన్నగూడెం గ్రామానికి చెందిన గాయాల వెంకటయ్యకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు కాగా తనకున్న ఏడు ఎకరాల వ్యవసాయ భూమిలో భాస్కర లక్ష్మి, తాళ్లపల్లి రాధిక అనే తన ఇద్దరు కూతుళ్లకు పసుపు కుంకుమల కింద తలా 20 గుంటలు రెండేళ్ల క్రితం పట్టా చేయించాడు. ఇది మనసులో పెట్టుకున్న కొడుకు నరసింహ తోబుట్టులకు భూమి ఇవ్వడం ఇష్టం లేకపోవడంతో తరచూ తండ్రితో గొడవకు దిగేవాడు. ఈ క్రమంలోనే నిన్న (ఆదివారం) మధ్యాహ్నం వ్యవసాయ భూమి వద్ద మరోసారి తండ్రితో కొడుకు నరసింహ గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలోనే క్షణికావేశంలో తండ్రిపై కర్రతో బలంగా కొట్టడంతో వెంకటయ్య అక్కడికక్కడే చనిపోయాడు. మృతుని కూతురు రేణుక ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేయగా సీఐ విశ్వేశ్వర్ కేసు దర్యాప్తు చేసి నిందితుడిని నరసింహాని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.



# ముగిసిన రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలు

- బాలుర విభాగంలో విజేతగా వరంగల్ జట్టు
- బాలికల విభాగంలో విజేతగా నిజామాబాద్

**తొర్రూర్,విశాల భారతి:** పట్టణంలోని యతి రాజారావు పార్కులో గత రెండు రోజులు కొనసాగుతున్న అండర్ 17 రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీలు.
ఎస్ జీ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో కొనసాగిన రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో వరంగల్ విజేతగా నిలవగా, ఆదిలాబాద్ ద్వితీయ స్థానంలో, కరీంనగర్ తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు విజేతగా నిలవగా, రన్నరప్ గా కరీంనగర్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు నిలిచాయి. విజేతలకు ఎస్జీఎఫ్ఐ రాష్ట్ర పరిశీలకులు గంగా మోహన్, జిల్లా క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య, ఎస్ జిఎఫ్ఐ రాష్ట్ర ప్రతినిధుల చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని బిలాస్ పుర్ లో 2024 జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు 16 మంది చొప్పున బాలురు, బాలికలను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర పరిశీలకులు గంగా మోహన్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ జీఎఫ్ఐ ప్రతినిధులు ప్రేమ్, జలగం రఘువీర్, శంకరయ్య, ముఖర్జీ, ఉస్మాన్, శ్రీనివాస్, ఆయా జిల్లాల క్రీడాకారులు, కోచ్ లు పాల్గొన్నారు.



# పెండింగ్ ప్రాజెక్టులను కంప్లీట్ చేయాలి

- ఉమ్మడి జిల్లా మంత్రులదే బాధ్యత
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

**మిర్యాలగూడ, విశాలభారతి:** జిల్లాలో పెండింగ్ లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులను కంప్లీట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం సీపీఎం పార్టీ ఆఫీస్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఎల్ బీసీ టెన్నల్ పనులు, ఎడమ కాల్వ లిఫ్ట్ ల నిర్వహణ, రిపేర్లు, వరద కాల్వ పనులను తక్షణ పూర్తికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు చిత్త శుద్ధితో వ్యవహరించాలన్నారు. పెండింగ్ పనుల పూర్తి బాధ్యత జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులదే నన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు నూకల జగదీష్ చంద్ర, మూడవత్ రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి ఉన్నారు.



# అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా మంత్రి కోమటిరెడ్డి**

**చిట్యాల, విశాలభారతి:** అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి రెడ్డి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల, నార్కట్ పల్లికి వస్తున్న సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో నకిరేకల్ లో గెలిపించి వేరేశం ను ఎమ్మెల్యే గా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తానని గత పది సంవత్సరాలు అధికారంలో లేకున్నా ప్రజల మధ్యే ఉన్నామన్నారు. చిట్యాలలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం కి రూ.65కోట్లతో జనవరి 2న టెండర్ స్టార్ట్ చేసి సంక్రాంతికి శంకుస్థాపన చేస్తానని అలాగే చిట్యాల భువనగిరి రోడ్డు నీ త్వరలోనే రూ.400కోట్లతో 4 లైన్ల రోడ్డుగా నిర్మాణం పనులకి త్వరలోనే శంకుస్థాపన చేస్తానన్నారు. చిట్యాల మున్సిపాలిటీ కి అధిక నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జంపాల వెంకన్న,ఎస్.కె ఇబ్రహీం, జిట్టా చంద్రకాంత్, బెల్లి సైదులు, కుక్కల మోహన్, ,సల్ల రాజు,బోడ శ్రీను,బోడ స్వామి,ఎండి ముభిన్, జిట్టా బిక్షం,చిన స్వామి,పాల శివ, కళ్లెం నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మతిభ్రమించింది

- శాసనసభ వేదికగా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు
- 10 సంవత్సరాలలో అమలుపరచని వాగ్దానాలు



**పినపాక , విశాల భారతి :** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయ దంక మోగించిన తర్వాత జరుగుతున్న తొలి శాసనసభ సమావేశాలలో ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి వాడి వేడి మాటలు యుద్ధం కొనసాగుతుంది. గత నాలుగు రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పై కేటీఆర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడిశాల రామనాథం బయ్యారం క్రాస్ రోడ్ నందు పార్టీ ఆఫీసులో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ ఎస్ ప్రభుత్వం పాలించిన పది సంవత్సరాలలో ప్రకటించిన హామీలు అమలుపరచని వాగ్దానాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేస్తుంటే జీర్ణించుకోలేక గత ప్రభుత్వ పాలకులు మాజీ మంత్రి కేటీఆర్ ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితులలో మతిభ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారానికి దూరమవుతామని తెలిసినా కూడా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను, ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుమని పది రోజులు పూర్తికాకుండానే గత ప్రభుత్వంలో చేసిన పనుల గురించి చర్చా వేదికగా చర్చించవలసిన విషయాలను పక్కనపెట్టి ప్రతిపక్ష నాయకులు 50 సంవత్సరాల చరిత్ర చెబుతానని పక్కదోవ పట్టిస్తున్న కేటీఆర్, హరీష్ రావు ఇటువంటి ధోరణి మానుకొని అసెంబ్లీ సమావేశంలో ప్రజల సమస్యలపై సమయాన్ని కేటాయించి ప్రజలకు ఉపయోగపడేలా నడుచుకోవాలని అన్నారు. సమావేశంలో కొంబత్తిని శ్రీను, గీద సాయిబాబు, తాళ్లూరి కాంతారావు మాటూరి ప్రవీణ్ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

**ఐఎఫ్ టియు నాయకులు సాధనపల్లి రవి విజ్ఞప్తి**

**మణుగూరు,విశాల భారతి :** మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకం అమలు నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలనీ ఐఎఫ్ టియు మణుగూరు ఏరియా నాయకులు సాధనపల్లి రవి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నాడు స్థానిక సురక్షా బస్ స్టాండ్ లో జరిగిన ఆటో డ్రైవర్స్ సమావేశం లో ఆయన మాట్లాడారు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ మేనిఫెస్టో ఆరు గ్యారంటీల పథకాలు అమలులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు టీఎస్ ఆర్టీసీ బస్సులో ఈనెల తొమ్మిదవ తేదీ నుండి ప్రారంభమైన ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడంతో ఆటోలు నడిపి తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో డ్రైవర్లు మరియు ఓనర్ కం డ్రైవర్ల ఇతర కార్మికుల ఉపాధి పై తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. ఒకరకంగా ఎంకి పెళ్ళి సుబ్బిచావుకు వచ్చిందన్న సామెతగా ఆటో డ్రైవర్ల పాలిట శాపంగా ఈ పథకం తయారైందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీ సంగతి ఏమో కానీ ఆటోలపై ప్రయాణించే ప్రయాణికులు లేక ఆటో డ్రైవర్ బ్రతుక్కి గ్యారెంటీ లేకుండా పోయిందనీ ఆయన వాపోయారు. డీజిల్ రేట్లు, వాహన కొనుగోలు విడిభాగాల కొనుగోలు రేట్లు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ ఉచిత పథకం మూలిగే నక్కపై తాటి పండులా ఆటోల పరిస్థితి తయారైందన్నారు.



# మిషన్ భగీరథ నీరు కలుషితం

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి...!**

మిర్యాలగూడ, విశాలభారతి:
మున్సిపాలిటీ, రూరల్ ఏరియాలకు వచ్చే మిషన్ భగీరథ నీరు కలుషితం అవ్వడంతో పాటు సరఫరా, నిర్వహణ లో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అధికారుల, ప్రజాప్రతినిధుల సమీక్షలో ఆర్ అండ్ బీ, సినిమాటో గ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని, జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు కేంద్రంలో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు స్పందించిన మంత్రి వెంకట్ రెడ్డి మిషన్ భగీరథ నీటి సరఫరా లో సమస్యలు లేకుండా చూడాలని డిప్యూటీ కలెక్టర్ ను ఆదేశించారు.



# ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టాలి

**మణుగూరు,విశాల భారతి :** గ్రామపంచాయతీని, 2005వ సంవత్సరంలో మున్సిపాలిటీగా గుర్తించి ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడిచారని, ఫలితంగా మణుగూరులో ఎటువంటి అభివృద్ధి లేకుండా వ్యవస్థలు కుంటుపడ్డాయని మణుగూరు మండలం మాజీ జెడ్పిటిసి పాల్వంచ దుర్గ అన్నారు. సోమవారం ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఆర్డిఏ పీడిని కలిసి, మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఫలితంగా 50 వేల మంది గిరిజన ప్రజలు ఉపాధి పొందుతారని ఆమె పి.డి.కి తెలిపారు. ఎక్కడా లేని విధంగా కేవలం మణుగూరు పంచాయతీలో మాత్రమే, హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా మున్సిపాలిటీ పరిపాలన కొనసాగిస్తున్నారని, కోర్టు తీర్పులు అనుసరించి మణుగూరును పంచాయతీగా పరిగణించి సత్వరమే ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఆమె ప్రజావాణి ద్వారా డిఆర్డిఏ పీడిని కోరారు.

# నివాళులర్పించిన అంతటి పారిజాత నరసింహ



**చిట్యాల, విశాలభారతి:** మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన రూపని మహేష్ అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు అంతటి పారిజాత నరసింహ గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశానుసారం మహేష్ కుటుంబానికి 5వేల రూ.ల ఆర్థిక సాయం అందజేసారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, కాటం సత్తయ్య, ఏనుగు సుధాకర్ రెడ్డి,అంశల సత్యనారాయణ, గోలి మహేష్, నాతి గోపాల్, వరికుప్పల నర్సింహ,గుర్రం జంగయ్య, దేశబోయిన మల్లేష్,కూరకుల సురేష్, చిరగొని గణేష్ తదితరులు నివాళులర్పించారు.

## కుటుంబ నియంత్రణ శిబిరం విజయవంతం

**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలోని వంగర ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన కోత కుట్టు లేని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరం విజయవంతమైనట్లు వంగర వైద్యులు శ్రీనాథ్ తెలిపారు. వంగర, ముల్కనూరు, గోపాల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 31 మందికి డాక్టర్ యాకూబ్ పాషా ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. కార్యక్రమంలో వైద్యులు రెహమాన్, రుబీనా, కే ఎల్ ఎన్ స్వామి, మాధవరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

**పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు**



**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు అధికారులకు మస్కాకొడుతూ యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల పరిధిలోని కొప్పూర్, ముల్కనూర్, కొత్తకొండ వాగు నుంచి ఇసుక వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**రాత్రి, పగలు తేడా లేకుండా:**
మండలంలో రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతోంది. రాత్రి 10 గంటలకు మొదలుకొని తెల్లవారు జామున 5 గంటల వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుకను రూ.4,000 నుంచి రూ.5,000 వరకు విక్రయిస్తున్నారు.

**ఎలాంటి కాగితాలు ఉండవు:**
ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు ఎలాంటి కాగితాలు ఉండడంలేదు. డ్రైవర్లకు లైసెన్స్లు కూడా ఉండడంలేదు. డ్రైవర్లు తమ ఇష్టానుసారం గా ట్రాక్టర్లను అతివేగంతో నడుపుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు నిఘా పెంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.




## సిగ్నలింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి

- **అడ్వకేట్ రుద్ర వెంకట్**
- **మణుగూరు డిఎస్పి కి వినతి పత్రం అందజేత**

**మణుగూరు, విశాలభారతి:** పట్టణంలోని మణుగూరు సబ్ డివిజనల్ అధికారి డిఎస్పి రాఘవేంద్రరావు ని సోమ వారం నాడు అడ్వకేట్ రుద్ర వెంకట్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రుద్ర వెంకట్ డిఎస్పి తో మాట్లాడుతూ మణుగూరు పట్టణంలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది ముఖ్యంగా సింగరేణి మరియు బిటిపిఎస్ లలో ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్మికులు వేలాదిమంది నిత్యం పనిచేస్తూ రాకపోకలు నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా మణుగూరు జనాభా లక్ష వరకు పెరగడం వలన కూడా ట్రాఫిక్ సమస్య అధికం అయ్యింది. అదేవిధంగా మణుగూరు కి నిత్యం చుట్టుపక్కల మూడు నాలుగు మండలాల నుంచి ప్రజలు ఏదో ఒక పనిపై రావడం వలన కూడా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. కావున ఈ సమస్యను పరిష్కరించాలంటే ట్రాఫిక్ సిగ్నలింగ్ సిస్టం ఏర్పాటు చేయడం వల్ల ఈ సమస్య తీరుతుందని రుద్ర వెంకట్ డిఎస్పి కి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## దేవదాయ శాఖ మంత్రిని కలిసిన కొత్తకొండ ఈవో

**భీమదేవరపల్లి, విశాల భారతి:** ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సోమవారం కొత్తకొండ దేవస్థానం ఈవో కిషన్ రావ్ ఆలయ సిబ్బంది హైదరాబాదులోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి పలువురు మంత్రి సురేఖను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే పుష్ప గుచ్చం అందించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఆలయ అర్చకులు రాంబాబు, మండల కాంగ్రెస్ నాయకులు ఆదరి రవి, పవన్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్, ఎదులపురం తిరుపతి తదితరులు ఉన్నారు.

## తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సంపత్



**చిగురుమామిడి, విశాల భారతి:** తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చర్ల సంఘం (TSGLA475) నూతన కార్యవర్గం హైదరాబాద్ లో జరిగింది. ఈ కార్యవర్గ సమావేశంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తున్న ఇల్లందుల సంపత్ కుమార్ ను తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సంపత్ ఎన్నిక పట్ల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్ మోహన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు హర్షం జనార్ధన్, రవి కుమార్, గోవర్ధన్ రెడ్డి, మహేందర్, కృష్ణమోహన్ లైబ్రరియన్ శ్రీనివాస్, అనిత, మమత, స్వరూప రాణి, కవిత, కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ సంఘం తనపై ఉంచిన బాధ్యతను నెరవేరుస్తానని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, ట్ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎల్ దేవేందర్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కొప్పిశెట్టి సురేష్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**చిగురుమామిడి, విశాల భారతి:** కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారంగా వెలుగొందుతునన్న కరీంనగర్ జిల్లా చిగురుమామిడి స్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దివ్యక్షేత్రంలో షష్టి తిథిన సోమవారం మార్గ షిర శుక్ల పక్ష షష్టి తిది సుబ్రహ్మణ్యస్వర స్వామి వారి జన్మదినం కావటంతో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను గురూజీ ఉమేష్ స్వామి చేతుల మీదుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమితి సుబ్రహ్మణ్య స్వామికి అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కోహెడ మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కనకా రెడ్డి కుటుంబ సభ్యులు 10వేల రూపాయలు ఆలయానికి విరాళంగా అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక హోమం కార్యక్రమం నిర్వహించుకొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ పూజలో ఆలయ ధర్మకర్తలు మోహన్ రెడ్డి, తెరాల సత్య నారాయణ,తేరాలా అమర్,సునీల్ కుమార్,ప్రవీణ్ కుమార్,కోనేటి సాగర్,పెసరి సంతోష్, స్వామి,గుంటిపల్లి సంతోష్, మోటం రాజు తదితరులు పాల్గొన్నారు.



## నీటిని విడుదల చేసిన అధికారులు

**ఆర్మూర్, విశాల భారతి:** నందిపేట్ మండలంలోని ఉమ్మేడ శివారులో గల అర్గుల్, రాజారాం, గుత్ప ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చెయ్యాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సోమవారం అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు నీటిని విడుల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యసంగి పంట కోసం నీటిని విడుదల చేశాం అని.. ఆయకట్టు రైతులు నీటిని వినియోగించుకోవాలని కోరారు. గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 38,792 ఎకరాలకు నీరు అందుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ యశస్వి, ఇ ఇ భాను ప్రకాష్, డి ఇ ఇ రవి కుమార్, ఏ ఇ ఇ ప్రవీణ్ పాల్గోన్నారు.




## మగ్గం వర్క్ తో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

**రాజన్న సిరిసిల్ల, విశాల భారతి:** మగ్గం వర్క్ ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలంలో గల రాజన్నపేట గ్రామంలో నాబార్డ్ వారి సౌజన్యంతో జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మగ్గం వర్క్ ఎంఈడిపి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏజీఎం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కుట్లు అల్లికల ద్వారా, ప్రజెంట్ ట్రెండ్ కు తగ్గట్టు మగ్గం వర్క్ నేర్చుకొని 15రోజుల శిక్షణ కాలంలో మధ్యాహ్నం భోజనం రోజుకి 50రూపాయలు చొప్పున స్టైఫండ్ తో పాటు 15రోజులకు రూ.750 తో పాటు సర్టిఫికెట్ ను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి పెండ్లి సంపత్ కుమార్,రాజన్నపేట సర్పంచ్ ముష్క శంకర్ తోపాటు జన వికాస ప్రతినిధులు రాజు,మగ్గం వర్క్ ట్రైనర్ మనీషా వివో ఏలు 30మంది స్వశక్తి మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దేవస్థాన చైర్మన్ గా చంద్రశేఖర్ గుప్తని కేటాయించాలి



**భీమదేవరపల్లి, విశాల భారతి:** గత 30 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తాకి కొత్తకొండ దేవస్థాన చైర్మన్ పదవిని ఇవ్వలని కొత్తపల్లి గ్రామస్తులు కాంగ్రెస్ యువనేత శిఖ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆయన కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ పదవికి తగిన నాయకులని తెలిపారు. తనకు ఆలయ కమిటీ ఛైర్మన్ కేటాయిస్తే జనవరి నెలలో వచ్చే జాతర బ్రహ్మోత్సవాలు జయప్రదంగా నిర్వహిస్తారని, తాను దివంగత మాజీ ఎమ్మెల్యేలు బొమ్మ వెంకన్న, కేతిరి సాయిరెడ్డి, సీనియర్ నేత కేతిరి సుదర్శన్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో నడిచానని గుర్తు చేసారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో చంద్రశేఖర్ గుప్తాకి ఛైర్మన్ పదవి వస్తుందని ధీమావ్యక్తం చేస్తున్నారు.



## కలెక్టర్ ను కలిసిన ఆటో డ్రైవర్లు

**ఆర్మూర్, విశాల భారతి:** నందిపేట్ మండలంలోని ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేయడం వలన ఆటోలలో ప్రయాణికులు ఎక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని సంపాదనతో జీవితాన్ని నెట్టుకు వస్తున్నామని ఇప్పుడున్న పరిస్థితులలో ప్రయాణికులు ఎక్కకపోతే తమ బతుకులు రోడ్డున పడతాయని అన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి నెలకు 15 వేల జీవనభృతి ఇవ్వాలని కోరారు. ఆటోల సేవలను ప్రభుత్వ సంస్థలను ఉపయోగించుకొని ఇల్లు లేని నిరుపేద ఆటో కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాలని.. అదేవిధంగా ఆటో కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు.



## చుక్క గుర్తుకు ఓటేసి గెలిపించండి

**ఏఐటీయూసీ మిర్యాల రంగయ్య**

**మందమర్రి టౌన్, విశాల భారతి:** నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతున్న సంఘం చుక్కగుర్తుకు డిసెంబర్ 27వ తారికున జరుగు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటువేసి ఏఐటీయూసీ సంఘాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య కార్మికులను కోరారు. సోమవారం మందమర్రి ఏరియా కేకే5 గనిపై రెండవ షిఫ్ట్ లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మిర్యాల రంగయ్య, బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ.. 1964లో కామ్రేడ్ విట్టల్ రావు యూనియన్ అధ్యక్షులుగా ఉండి లాభాలబోనస్ (దీపావళి బోనస్) సాధించారు. 21/02/2000 ఒప్పందం ప్రకారం మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు 10%ఇంటి కిరాయి, ఎస్డిఎల్ ఆపరేటర్లకు 4 వ క్యాటగిరి నుండి 5,6వ క్యాటగిరి డి గ్రేడ్, సి గ్రేడ్, బి గ్రేడ్ వరకు ఇప్పించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు బానోత్ నాగేష్, జెట్టి మల్లయ్య, పిట్ సెక్రటరీ దేవసాని సాంబయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ప్రేమ్ లాల్, ఇంచార్జి మేకల సంతు, కాసం సమ్మయ్య, సాదుల సంపత్, గోవిందుల రమేష్, షిఫ్ట్ ఇంచార్జి శ్రీకాంత్, నాగేశ్వరావు, అజయ్, దినేష్, అసంపెల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాములు తండకు బస్సులు నడపాలి

- **గతంలో రాములు తండకు బస్సులు నడిచే -టివి-బోడా నర్సింగ్ నాయక్**
- **12 వేల జనాభా కలిగిన రూటుకు బస్సులు నడవకపోవడం బాధాకరం**

**విశాలభారతి,ఖమ్మం:** రాములు తండా యూత్ అధ్యక్షుడు బోడా నర్సింగ్ నాయక్ ఆధ్వర్యంలో ఖమ్మం బస్ డిపో మేనేజర్ ను కలిసి గతంలో రాములతండకు బస్సు సర్వీసులు ఉండవని కొన్ని అనివార్య కారణాల వల్ల బస్ సర్వీసులో ఆపడం జరిగింది. అప్పటినుండి రాములు తండా గ్రామా ప్రజలు ఇబ్బందులు పడడం జరుగుతున్నది. కావున ఈరోజు రాములు తండా యూత్ అధ్యక్షులు బోడ నర్సింగ్ నాయక్, ఆధ్వర్యంలో ఖమ్మం బస్ డిపో మేనేజర్ గారిని కలిసి మరల బస్సులు పునరుదించాలని కోరడం జరిగింది. ఖమ్మం నుండి రాములు తండా 13km వస్తుంది. ఖమ్మం నుండి అతి దగ్గరా లో గ్రామ ప్రజలు కాలేజీ పిల్లలు చాలా ఇబ్బందులు పడుతూ ప్రతిరోజు 200 నుంచి 300 వరకు ఆ రూట్ లో కాలేజీ పిల్లలు తమ తమ వెసులుబాటుతో ఖమ్మంకు చేరుకోవడం జరుగుతుంది. కావున ఇవన్నీ గమనించి ఖమ్మం నుండి రాములు తండకు బస్సు సర్వీసులు ప్రారంభించలని , మా విన్నపాన్ని ఖమ్మం డిపో మేనేజర్ గారు సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంగ్రెస్ కిసాన్ జిల్లా సెకెరీట్రీ బోడా తవుర్యా, బోడా లకుపతి ,వార్డు మేంబర్ గ్రామ ప్రజలు బోడా హట్టి ,బానోతు హరిలాల్, బోడా నర్సింగ్ నాయక్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## విశ్వకర్మ యోజన గొప్ప పథకం



**నారాయణఖేడ్, విశాల భారతి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం పేద యువకుల్లో స్వయం ఉపాధిని పెంచుతుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప అన్నారు. విశ్వకర్మ యోజన వల్ల కుల వృత్తులపై ఎంతో గౌరవం పెరుగుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ అన్నారు. నారాయణఖేడ్లో విశ్వకర్మ యోజన అవగాహన సదస్సులో పాల్గొన్న నాయకులు ఈ పథకం గొప్పతనాన్ని వివరించారు. ఖేడ్ లో సంగప్ప అధ్యక్షతన జరిగిన విశ్వకర్మ యోజన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలే భాస్కర్ ఈ పథకాన్ని ఉత్సాహవంతులైన యువతీ యువకులు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో యువతీ యువకులు ఈ పథకం ద్వారా రుణాన్ని పొంది తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఎంతో ఉపయోగపడుతుందని భాస్కర్ అన్నారు. 18 రకాల చేతి వృత్తులకు ఈ విశ్వకర్మ యోజన రుణం అందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, సంజయ్, శ్రీనివాస్, సాయిరాం తోపాటు భారీ సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.




# సలార్ సీజ్ ఫైర్ ట్రైలర్ విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్'. అన్‌కాంప్రమైజ్డ్ బడ్జెట్‌తో అందరూ ఆశ్చర్యపోయే ప్రొడక్షన్ వేల్యూస్‌తో సినిమాలను నిర్మిస్తోన్న ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. మోస్ట్ అవెయిటెడ్ మూవీగా అనౌన్స్‌మెంట్ రోజు నుంచే ఎప్పుడెప్పుడు సినిమా వస్తుందా అనేంత రేంజ్‌లో ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచిన ఈ సినిమా డిసెంబర్ 22న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్నంటింది. సోమవారం మేకర్స్ ఈ మూవీ నుంచి రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. ఇద్దరు పిల్లల మధ్య స్నేహం.. వారి పెరిగి పెద్దయిన తర్వాత కాన్సార్ ప్రాంతానికి రాజు (పృథ్వీరాజ్ సుకుమారన్) కావాలనుకున్న వాడిపై శత్రువులు దాడి చేస్తే తన స్నేహితుడి కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాటం చేసే మరో స్నేహితుడు దేవా (ప్రభాస్) కథే సలార్ సీజ్ ఫైర్ అని స్పష్టమవుతుంది. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న అంచనాలు రిలీజ్ ట్రైలర్‌తో మరింత పీక్స్‌కి చేరుకున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ ట్రైలర్, టీజర్, సూరీడే సాంగ్‌లకు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్‌ని రాబట్టుకున్నాయి. సలార్ సీజ్ ఫైర్ కేవలం యాక్షన్ సినిమాయే కాదు..అంతకు మించి ఎమోషనల్ కంటెంట్ ఉంటుందని ఆడియెన్స్‌కి క్లియర్‌గా తెలుస్తోంది.

# వాట్ ది ఫిష్ ఫస్ట్ లుక్ విడుదల

నిహారిక కొణిదెల 'వాట్ ది ఫిష్' తో కమర్షియల్ కమ్ బ్యాక్ ఇస్తున్నారు. ఇందులో నిహారిక ప్రధాన పాత్ర పోషిస్తోస్తున్నారు. వరుణ్ కోరుకొండ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమౌతున్నారు. 'వెన్ ది క్రేజీ బికమ్స్ క్రేజియర్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. 'వాట్ ది ఫిష్' అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో రూపొందుతోంది. 6ix సినిమాస్‌పై విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నిహారిక స్టైలిష్‌గా నడుస్తూ కనిపించారు. తన వెనుక డాలర్ ఇమేజ్ వుంది. నిహారిక ఎలిగెంట్‌అవతార్‌లో మెరిసే వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఆమె పాత్ర అష్టలక్ష్మి అకా ఏయస్ హెచ్. ఈ పాత్రని చాలా యూనిక్ గా డిజైన్ చేశారు. తెలుగు సినిమాలో ఇంతకు ముందెన్నడూ చూడని పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్, యాక్షన్-డ్రివెన్ పాత్ర. ఆమె పాత్ర ప్రేక్షకులని అద్భుతంగా అలరించబోతుందని దర్శకుడు చెప్పారు.




# హాయ్ నాన్న' ని ఇంత పెద్ద సక్సెస్ చేసి తెలుగు ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు

నేచురల్ స్టార్ నాని



నేచురల్ స్టార్ నాని హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న' మ్యాజికల్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. వైర ఎంటర్‌టైన్‌మెంట్ మొదటి ప్రొడక్షన్ వెంచర్ గా రూపొందిన ఈ చిత్రంతో శౌర్యువ్ దర్శకునిగా పరిచయమయ్యారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించగా, బేబీ కియారా ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించింది. ఈ చిత్రాన్ని మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. డిసెంబర్ 7న గ్రాండ్ గా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి ఘన విజయాన్ని సాధించింది. ప్రేక్షకులతో పాటు విమర్శకులు, ప్రముఖుల ప్రశంసలు అందుకుంటూ అద్భుతమైన కలెక్షన్స్ తో అన్ని చోట్ల సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ గా బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్స్ ని నిర్వహించింది. ఈ వేడుకలో హీరో నాని చేతుల మీదగా చిత్ర యూనిట్ సభ్యులకు మెమెంటోలు అందించారు. బ్లాక్ బస్టర్ నాన్న సెలబ్రేషన్స్ లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. హాయ్ నాన్న జర్నీ వీడియో చూసినప్పుడు ఇన్ని చోట్ల తిరిగామా అనిపించింది. ఇది చాలా స్పెషల్ ఫీలింగ్. సినిమా విజయం తర్వాత జరుపుకునే ఇలాంటి వేడుకలో ఒకరికి ఒకరు థాంక్స్ చెప్పుకోవడం చాలా ఆనందాన్ని ఇస్తుంది. హాయ్ నాన్న లాంటి బ్యూటీఫుల్ ఫిల్మ్ తో ఈ విజయం అందుకోవడం ఇంకా స్పెషల్. బాక్సాఫీసు లెక్కలు, స్థానాలు, స్థాయిలని మాట్లడుతుంటారు. నాకు సంబంధించినంత వరకూ శుక్రవారం సినిమా విడుదలైతే ''నాని సినిమాకి వెళ్దాంరా' అని ప్రేక్షకులు అన్నారంటే అదే గొప్ప స్థాయి. దానికి మించిన స్థాయి ప్రపంచంలో మరొకటి లేదనినమ్ముతాను. ఆ స్థాయి, స్థానాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూనే వుంటాను. హాయ్ నాన్నని ఇంత పెద్ద సక్సెస్ చేసిందుకు, మీ మనసులో పెట్టుకున్నందుకు తెలుగు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మీకు ఎప్పటికీ రుణపడివుంటాం. ఇలాంటి మంచి సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తూనే వుంటాను. ఈ రోజు తర్వాత హాయ్ నాన్న టీం ని మిస్ కావచ్చు, కానీ హాయ్ నాన్నకి వచ్చిన ప్రేమని మాత్రం మిస్ కాను. ఈ ప్రేమ ఎక్కడా ఆగదు. అందరికీ ధన్యవాదాలు'' తెలిపారు.



# ఖుషీ దెబ్బకు కాస్మో కవర్ చినిగిందిగా

సూటిగా కళ్లలోకి చూడకండి! కాస్మిక్ రేస్ దూసుకెళతాయి.. ఆపై బర్న్ అవుతారు! అనవసర ఇబ్బందులు ఎదుర్కోవాలి. ఇది అబ్బాయిలకు స్టాట్యుటరీ వార్నింగ్. కపూర్ గాళ్ కళ్లలోని చురుకైన కాస్మిక్ రేస్.. మత్తైన జిగిబిగి అందాలు బోయ్స్ ని చిత్తు చేస్తాయి. చూస్తుండగానే అక్క జాన్వీకపూర్ కే పోటీకొస్తోంది ఖుషీ కపూర్. ఇన్నాళ్లు జాన్వీ గురించి మాట్లాడిన వారంతా ఇప్పుడు ఖుషీ గురించి మాట్లాడాల్సి వస్తోంది. గ్లామర్ వరల్డ్ ని షేక్ చేయడానికి ఇటీవలే ది ఆర్చీస్ తో తెరంగేట్రం చేసిన ఈ బ్యూటీ చకచకా వరుస చిత్రాలకు సంతకాలు చేస్తోంది. V ఇక పబ్లిక్ ఈవెంట్లలో హెడ్ టర్నర్ గా నిలిచే ఖుషీ కపూర్ ఇప్పుడు పాపులర్ మ్యాగజైన్ కాస్మోపాలిటన్ కవర్ పేజీపై గుబులు రేపింది. తన ఎత్తుకు తగ్గట్టుగా సీక్విన్ కార్సెట్ టాప్‌లో ఈ బ్యూటీ ఆకర్షణీయంగా కనిపించింది. పాక్షికంగా అందాలను ఎలివేట్ చేసే మెస్సీ(జల్లెడ) దుస్తుల్లో మైండ్ బ్లాక్ చేసింది ఖుషీ. ఈ లుక్ మడోన్నా, ఏంజెలినా లాంటి డస్కీ అందాలకు తక్కువేమీ కాదు! అంటూ ఇప్పుడు అబ్బాయిలు కామెంట్ చేస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఖుషీ నటించిన తొలి వెబ్ చిత్రం `ది ఆర్చీస్` ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. ఈ చిత్రంలో బెట్టీ పాత్రకు మంచి సమీక్షలను అందుకుంది. సుహానా ఖాన్ - అగస్త్య నందా లాంటి నటవారసులతో కలిసి ఖుషీ స్క్రీన్ స్పేస్‌ను షేర్ చేసుకుంది. ఇటీవల ఓ కార్యక్రమంలో ఖుషీ అక్క జాన్వి కపూర్ నెట్‌ఫ్లిక్స్ చిత్రంపై తన ఆలోచనలను షేర్ చేసుకుంది. ఖుషీని ప్రశంసిస్తూనే తనవంతుగా కొన్ని సలహాలు ఇచ్చింది.

# రవితేజ మిస్టర్ బచ్చన్ ఘనంగా ప్రారంభం



మాస్ మహారాజా రవితేజ బిగ్ బి అమితాబ్ బచ్చన్‌కి వీరాభిమాని, హిందీలో అనర్గళంగా మాట్లాడగలరు. తన కొన్ని సినిమాలలో బిగ్ బిని అనుకరిస్తూ అలరించారు. అసలు విషయానికి వస్తే.. బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్‌తో రవితేజ చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌కు 'మిస్టర్ బచ్చన్' అనే పవర్ టైటిల్ ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్ రవితేజ అమితాబ్ బచ్చన్ ఐకానిక్ పోజ్‌ను అనుకరిస్తున్నట్లు అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. రవితేజ పాత స్కూటర్‌పై షేడ్స్‌తో స్టైల్‌గా కూర్చుని కనిపిస్తున్నారు. అతని వెనుక నటరాజ్ థియేటర్, అమితాబ్ బచ్చన్ ఇమేజ్ చూడవచ్చు. అతను సినిమా లవరా? సినిమాలో అమితాబ్ బచ్చన్‌కి వీరాభిమానా? 'బిగ్ బినామ్ తో సునా హోగా' అనే పాపులర్ డైలాగ్ ఈ సినిమా ట్యాగ్ లైన్. టైటిల్ పోస్టర్ మాస్, అభిమానులు, అన్ని వర్గాల ప్రేక్షకులను ఖచ్చితంగా మెప్పిస్తుంది. ఈ మ్యాజికల్ మాస్ కాంబోలో రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయిక గా నటిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. పనోరమా స్టూడియోస్, టిసిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నాయి.

# మళ్లీ పెళ్లిపై సమంత రియాక్షన్ ఇదే!

నాగచైతన్యతో విడాకుల తర్వాత సినిమాలతో బిజీబిజీగా ఉన్న సమంత అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడ్డ సంగతి తెలిసిందే. విదేశాలలో చికిత్స తర్వాత కోలుకుంటున్న ఈ స్టార్ హీరోయిన్ కు తాజాగా ఓ నెటిజన్ నుంచి రెండో పెళ్లి గురించి ప్రశ్న ఎదురైంది. వీకెండ్ సందర్భంగా 'ఆస్క్ మీ' అంటూ సమంత సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించింది. ఈ క్రమంలో 'మీరు మళ్లీ పెళ్లి ఎందుకు చేసుకోకూడదు ?' అంటూ ఓ అభిమాని ప్రశ్నించగా.. సామ్ వెరైటీగా జవాబిచ్చింది. 2023 లో విడాకుల వివరాలను కోట్ చేస్తూ.. రెండో పెళ్లి అనేది బ్యాడ్ ఇన్వెస్ట్ మెంట్ అని చెప్పింది. కీ డివోర్స్ స్టాటిస్టిక్స్ అంటూ సమంత ఓ ఇమేజ్ తో అభిమానికి జవాబిచ్చింది. అధికారిక గణాంకాల ప్రకారం.. మొదటి పెళ్లి విడాకుల శాతం 50.. రెండు, మూడో పెళ్లి చేసుకున్న వారిలో వరుసగా 67 శాతం, 73 శాతం మంది మళ్లీ విడిపోతున్నారని పేర్కొంది. స్త్రీ పురుషులు ఇద్దరి విషయంలోనూ ఇలాగే ఉందని సామ్ చెప్పింది. అందుకే, ఆ ఆలోచన బ్యాడ్ ఇన్వెస్ట్ మెంట్ కిందికి వస్తుందని వివరించింది. మరో అభిమాని అడిగిన ప్రశ్నకు జవాబుగా.. తనకు దేవుడిపై నమ్మకం ఉందని సామ్ తెలిపింది. 'మీ రోజువారీ దినచర్యలోనే మీ విజయ రహస్యం దాగి ఉంటుంది' అని కోట్ చేసింది. కాగా, సామ్ నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.